




# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శుక్రవారం 09-08-2024 సంపుటి : 06 సంచిక : 320 పేజీలు : 8 వెల : రూ 3-00


## ఏపీలో త్వరలో జన్మభూమి-2 ప్రారంభం..

### టీడీపీ పొలిట్‌బ్యూరో నిర్ణయం



అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జన్మభూమి-2 ను ప్రారంభించాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సమావేశం నిర్ణయం తీసుకుంది. విజయవాడలో గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన టీడీపీ పొలిట్‌బ్యూరో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చ జరిగింది. నైపుణ్య గణన దేశంలోనే తొలిసారిగా చేపట్టాలని, ఎస్సీ వర్గీకరణను జిల్లా యూనిట్‌గా చేపట్టాలని, త్వరలోనే మొదటి దశ నామినేటెడ్ పోస్టుల భర్తీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. అదేవిధంగా పార్టీ సభ్యత్వ నమోదును ప్రారంభించాలని, పేదరిక నిర్మూలనపై చర్చ జరిగిందని మంత్రి అచ్చెన్నాయుడు వివరించారు. ప్రభుత్వానికి ఇస్తున్న సమయాన్ని అంతే స్థాయిలో పార్టీకి కేటాయించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో భారీ ఘన విజయం ఇచ్చిన ప్రజలకు,ఎన్డీయే పార్టీలకు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి అభినందనలు తెలుపుతూ నిర్ణయం తీసుకున్నామన్నారు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు పైరవీకు తావులేకుండా, కష్టపడ్డ కార్యకర్తలకు నామినేటెడ్ పోస్టుల భర్తీ చేపడుతామని తెలిపారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను పార్టీలో పెట్టి చర్చిస్తామన్నారు. కూటమిలో సభ్యులకు కూడా నామినేటెడ్ పోస్టులు ఉంటాయని అన్నారు.

## ఏపీకి 8 కుంకి ఏనుగులు ఇచ్చేందుకు కర్ణాటక అంగీకారం : డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

అమరావతి : ఏపీ సరిహద్దుల్లో ఏనుగుల బీభత్సం సమస్యను పరిష్కరించేందుకు కర్ణాటక ప్రభుత్వం ఏపీకి 8 కుంకి ఏనుగులు ఇచ్చేందుకు అంగీకారం తెలిపింది. ఈ మేరకు ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కర్ణాటక సీఎం, అటవిశాఖ అధికారులతో గురువారం జరిపిన సమావేశంలో భేటీ అంశాలను వివరించారు. గురువారం ప్రత్యేక విమానంలో పవన్‌కల్యాణ్ బెంగళూరుకు చేరుకోగా అక్కడి అటవీశాఖ మంత్రి, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం కర్ణాటక సీఎం సిద్దరామయ్యతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సీఎంను పవన్ శాలువాతో సన్మానించారు. అనంతరం అధికారులతో చర్చల తరువాత చర్చల వివరాలను పవన్‌కల్యాణ్ మీడియాకు వివరించారు .మొత్తం ఏడు అంశాలపై చర్చించినట్లు డిప్యూటీ సీఎం పేర్కొన్నారు.



కర్ణాటక, ఏపీ సరిహద్దుల్లో ఏనుగుల సమస్య తీవ్రంగా ఉందని, ఇరు రాష్ట్రాల సమన్వయంతో ఏనుగుల దాడిని అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించామని తెలిపారు. ఏనుగుల సమస్య పరిష్కరించేందుకు 8 కుంకి ఏనుగులను ఏపీకి ఇచ్చేందుకు కర్ణాటక ఒప్పుకోవడం సంతోషమని పేర్కొన్నారు. అటవీ సంపద రక్షణకు ఐటీ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. ఎర్రచంద్రనం అక్రమ రవాణాను అరికట్టాలని, వన్యప్రాణుల స్మగ్లింగ్ చేసే వారిని కట్టడి చేయాలని నిర్ణయించామని తెలిపారు. సుమారు రూ. 140 కోట్ల విలువ గల ఎర్రచందనాన్ని పట్టుకున్న కర్ణాటక అటవీ అధికారులను అభినందించారు. శ్రీశైలం , తిరుపతి క్షేత్రాలకు వచ్చే కర్ణాటక భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని పవన్ కల్యాణ్ ప్రకటించారు.

## ఏపీ సర్కార్ కీలక నిర్ణయం.. జీవన్మృతులకు అధికారికంగా అంత్యక్రియలు

అమరావతి : బ్రెయిన్ డెడ్ ( అయి అవయవదానం చేసే జీవన్మృతులకు ప్రభుత్వం తరుపున అంత్యక్రియలు జరుపాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం గురువారం కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. అవయవదానానికి సంబంధించిన సమాచారాన్ని జిల్లా కలెక్టర్, ప్రభుత్వ ఆసుపత్రిలోని డీన్, మెడికల్ సూపరింటెండెంట్ లేదా జీవన్‌దాన్ కార్యక్రమంలో నమోదైన ఆస్పత్రుల నుంచి సమాచారం ఇవ్వాలని సూచించింది. ముందుగా ఏపీ స్టేట్ ఆర్గాన్ టిష్యూస్ ట్రాన్స్ ప్లాంటేషన్ ఆర్గనైజేషన్‌కు ఆలస్యం లేకుండా సమాచారం ఇవ్వాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. జీవన్మృతుడికి సంబంధించిన భౌతిక కాయానికి తగిన గౌరవం ఇస్తూ, ప్రభుత్వం తరుపున అంత్యక్రియలకు రూ. 10 వేల ఆర్థిక సాయంతో పాటు జిల్లా కలెక్టర్ తరఫున ప్రభుత్వ ప్రతినిధిగా ఒకరు హాజరు కావాలని సూచించింది.

## వైఎస్ జగన్‌పై మంత్రి నాదెండ్ల మనోహర్ ఫైర్



అమరావతి : ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పై మంత్రి నాదెండ్ల మనోహర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కోటల్లో ఉండే జగన్‌కు సామాన్య ప్రజల గురించి ఏం తెలుసని అన్నారు. గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. జగన్ రెండు రోజుల క్రితం ఏపీలో రాష్ట్రపతి పాలన విధించాలని కోర్టుకు వెళ్తామని చేసిన ప్రకటనపై నాదెండ్ల స్పందించారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలనఎందుకు పెట్టాలో చెప్పాలని డిమాండ్ చేశారు. వృద్ధులకు రూ. 4వేల పింఛన్ ఇస్తున్నందుకా, పోలవరం ప్రాజెక్టు పనులు ప్రారంభిస్తున్నందుకా అని ప్రశ్నించారు. మాజీ సీఎం ప్రతిపక్ష హోదా , భద్రతాపై కాకుండా ప్రజల గురించి , ప్రజల అవసరాలు ఏంటో తెలుసుకుని మాట్లాడాలనిసూచించారు. వైసీపీతాడూ,బొంగరంలేని పార్టీ అని విమర్శించారు. వైసీపీకి అధ్యక్షుడు , ప్రధాన కార్యదర్శి ఎవరో తెలియదని పేర్కొన్నారు.

# దక్షిణ భారత దేశానికి గోల్డ్ హబ్ గా మంగళగిరి

చేనేత కళాకారుల ఆదాయం పెరిగేలా కార్యచరణ
పార్టీలకు అతీతంగా సంక్షేమం, అభివృద్ధి ఎజెండా
ప్రతి అడుగు సమస్యల శాశ్వత పరిష్కారం వైపే
పేదరికం లేని మంగళగిరి కోసం నా నిరంతర కృషి
పద్మశాలీయ బహూత్తమ సంఘం సామాజిక సేవలు భేష్
మంగళగిరిలో కళ్యాణ మండపాన్ని ప్రారంభించిన లోకేష్



మంగళగిరి, పద్మశాలీయ బహూత్తమ సంఘం చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు అన్నివర్గాలకు ఆదర్శనీయంగా నిలుస్తున్నాయని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. మంగళగిరి నాంచారమ్మ చెరువు ప్రాంగణంలో పద్మశాలి బహుత్తమ సంఘం ఆధ్వర్యాన నూతనంగా నిర్మించిన కల్యాణ మండపాన్ని మంత్రి లోకేష్ గురువారం ఉదయం ప్రారంభించారు. శ్రీ భద్రావతి సమేత భావనారుషి స్వామి ఆలయ ప్రాంగణానికి చేరుకున్న లోకేష్, బ్రాహ్మణి దంపతులకు బహుత్తమ సంఘం పెద్దలు ఘన స్వాగతం పలికారు. అనంతరం భద్రావతి సమేత భావనారుషి స్వామి ఆలయాన్ని దర్శించుకొని లోకేష్, బ్రాహ్మణి దంపతులు ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ పద్మశాలీయ బహూత్తమ సంఘం చేపట్టే కార్యక్రమాలకు తమవంతు సహాయ, సహకారాలు అందిస్తామని చెప్పారు. ఆలయ అభివృద్ధి కి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. మంగళగిరి చేనేతలు తన ఆత్మ బంధువులని, ఎన్నికల్లో వారు తనపై చూపిన అభిమానం జీవితంలో మరువలేనని అన్నారు. మంగళగిరి చేనేతకు గత వైభవం కల్పించేందుకు అన్ని చర్యలూ చేపడతానని చెప్పారు. చేనేత కార్మికుల ఆదాయం పెంచడానికి పైలెట్ ప్రాజెక్టుగా వీవర్స్ శాల ఏర్పాటు చేసి టాటా తనేరా కంపెనీతో మార్కెట్ లింకేజ్ చేశామని అన్నారు. చేనేత లో భాగస్వామ్యం అయిన అన్ని విభాగాల కార్మికులకు ఆదాయం పెరిగే విధంగా కార్యచరణ రూపొందిస్తున్నాం, త్వరలోనే జీఎస్టీ సమస్య కూడా పరిష్కారం అవుతుంది అని లోకేష్ అన్నారు. మంగళగిరిలో ఉన్న స్వర్ణకారులకి స్కిల్ డెవలప్మెంట్ ద్వారా మెరుగైన డిజైన్లు తయారు చేసే శిక్షణ ఇస్తామని అన్నారు, దక్షిణ భారత దేశానికి గోల్డ్ హబ్ గా మంగళగిరిని తీర్చిదిద్దడానికి సుమారుగా 25 ఎకరాల్లో ప్రత్యేక గోల్డ్ హబ్ ఏర్పాటు కు కసరత్తు ప్రారంభించామని లోకేష్ తెలిపారు. మంగళగిరి లో ఏళ్ల తరబడి పేరుకుపోయిన అనేక సమస్యలు ఉన్నాయి. నేను వేసే ప్రతి అడుగు సమస్యల శాశ్వత పరిష్కారం వైపు ఉంటాయని స్పష్టం చేశారు. మూడు నెలలు రాజకీయాల కోసం పోరాడాం ఇప్పుడు 4 ఏళ్ల 9 నెలలు రాజకీయాలకు అతీతంగా అందరం కలిసి నియోజకవర్గం సంక్షేమం, అభివృద్ధి కోసం పని చేద్దాం అని లోకేష్ పిలుపు ఇచ్చారు. మంగళగిరి పట్టణ పద్మశాలీయ బహూత్తమ సంఘం ఆధ్వర్యంలోఅందరికీ అందుబాటులో ఉండే విధంగా కల్యాణ మండపం నిర్మించారని, సంఘం నిర్వహించే సేవా కార్యక్రమాల్లో యువత ను భాగస్వామ్యం చెయ్యాలని, మంగళగిరి చరిత్ర తెలుసుకోవడంతో పాటు చరిత్ర ను కాపాడటం కోసం యువత అన్ని కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని లోకేష్ అన్నారు. ఈ కార్ర్యమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతురావు ఆలయ అభివృద్ధి, చేనేత, స్వర్ణకారుల సంక్షేమం కోసం మంత్రి లోకేష్ కు పలు సూచనలు చేశారు. జీఎస్టీ పై కేంద్ర ప్రభుత్వం తో చర్చించడం, ఒకవేళ కేంద్రం ఒప్పుకోక పోతే జీఎస్టీ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడం పట్ల ఆయనకి కృతజ్ఞతలు తెలుపుతున్నానని మురుగుడు హనుమంత రావు అన్నారు. పెద్దలందరితో చర్చించిన తరువాత అన్ని కార్యక్రమాలు చేపడతామని లోకేష్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు మురుగుడు హనుమంతురావు, పంచుమర్తి అనురాధ, నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, జనసేన నియోజకవర్గం సమన్వయకర్త చిల్లపల్లి శ్రీనివాస్, పద్మశాలీయ బహుత్తమ సంఘం పెద్దలు పాల్గొన్నారు.××

## స్పీకర్ హక్కులను హరిస్తున్నారు

### లోక్‌సభలో అఖిలేశ్ యాదవ్ వ్యాఖ్యలు
### ధీటుగా తిప్పికొట్టిన హోంమంత్రి అమిత్ షా



న్యూఢిల్లీ,ఆగస్ట్ 8: సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ పార్లమెంట్‌లో సంచలన వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా హక్కులను కాలరాస్తున్నారని, ఆయన కోసం ప్రతిపక్షాలు పోరాడాల్సి వస్తోందని ఆరోపించారు. వక్ఫ్ బిల్లుపై చర్చ సందర్భంగా అఖిలేష్ యాదవ్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'మీ హక్కులు, మా హక్కులను హరించివేస్తున్నారు. ప్రజాస్వామ్యానికి మీరే న్యాయమూర్తి. కానీ మీ హక్కులు హరించివేస్తున్నారని నేను విన్నాను. మీ కోసం మేము పోరాడాలని అన్నారు. అఖిలేశ్ యాదవ్ చేసిన ఈ వ్యాఖ్యలపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా కౌంటర్లు ఇచ్చారు. ఈ వ్యాఖ్యలు స్పీకర్‌ను అవమానించడమేనని, స్పీకర్ హక్కులు ప్రతిపక్షానికి చెందినవి కావని ఆయన వ్యాఖ్యానించారు. స్పీకర్ హక్కులు సభ మొత్తానికి చెందుతాయని, ఈ విధంగా మాట్లాడడం సరికాదని అన్నారు. స్పీకర్ హక్కుల పరిరక్షించేది తమరు కాదని అమిత్ షా సెటైర్లు వేశారు. కాగా ఈ వ్యాఖ్యలపై స్పీకర్ ఓం బిర్లా కూడా స్పందించారు. తనపైనా, సభలోని ఇతర సభ్యులు ఎలాంటి వ్యాఖ్యలు చేయకూడదని, తాను ఇదే కోరుకుంటున్నానని అన్నారు. స్పీకర్ స్థానంపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయకూడదని వ్యాఖ్యానించారు. ఇండియా కూటమి పక్షాల నిరసన మధ్య కేంద్రప్రభుత్వం వక్ఫ్ బోర్డు సరణ బిల్లును లోక్‌సభలో మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రవేశపెట్టారు. తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు ముస్లిం సమాజం మెచ్చుకునేదిగా ఉందన్నారు. వక్ఫ్ బోర్డు చట్టంలో ఉన్న లొసుగులను సరిచేయడం కోసమే ఈ బిల్లు తీసుకొచ్చామన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం వక్ఫ్ బోర్డు చట్టాన్ని సరిగ్గా రూపొందించ లేదన్నారు. ఈ బిల్లు రాజ్యాంగంలోని ఏ అధికరణకు వ్యతిరేకంగా

## ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు..

ఢిల్లీ మద్యం పాలసీకి సంబంధించి సీబీఐ కేసులో సీఎం అరవింద్ కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని ఈ నెల 20 వరకు రౌస్ అవెన్యూ కోర్టు పొడిగించింది. ఈ మేరకు గురువారం కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. కస్టడీ గడువు ముగియడంతో సీబీఐ ఆయనను తిహార్ జైలు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టులో హాజరుపరిచారు. మద్యం పాలసీ కేసులో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ అరెస్టు చేయడాన్ని సవాల్ చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు సోమవారం కొట్టివేసిన విషయం తెలిసిందే. కేజ్రీవాల్ అరెస్ట్ సరైన కారణం లేకుండా అరెస్టు జరిగిందని చెప్పలేమని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసులో సీఎం కేజ్రీవాల్‌కు మంజూరైన బెయిల్‌ను రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌కు సంబంధించి ఈడీ వాయిదా కోరింది. కేజ్రీవాల్ బెయిల్‌ను రద్దు చేస్తే మళ్లీ అరెస్టు చేస్తారా? అని హైకోర్టు ఈడీని ప్రశ్నించింది. కోర్టు ఈ కేసును సెప్టెంబర్ 5కి వాయిదా వేసింది.



## నాగార్జున సాగర్ వద్ద కూలిపోయిన సుంకిశాల రిటెయినింగ్ వాల్ . తప్పిన పెను ప్రమాదం

హైదరాబాద్: నాగార్జున సాగర్ వద్ద సుంకిశాల రిటెయినింగ్ వాల్ కూలిపోయింది. కూలీలు షిఫ్ట మారే సమయంలో రిటెయినింగ్ వాల్ కూలిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఒక్కసారిగా రిటెయినింగ్ వాల్ కుప్పకూలడంతో సుంకిశాల పంపుహౌస్ నీట మునిగింది. ఇక్కడ మూడు షిఫ్టుల్లో వందల మంది కూలీలు పనిచేస్తుంటారు. సరిగ్గా కూలీలు షిఫ్ట మారే సమయంలో ఈ ప్రమాదం జరగడంతో అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణ నష్టం వాటిల్లలేదు. ఆగస్ట్ ఒకటో తేదీన ఉదయం ఆరు గంటలకు ఈ ఘటన జరిగినప్పటికి జలమండలి అధికారులు ఈ విషయాన్ని గోప్యంగా ఉంచినట్టు సమాచారం. సొరంగాన్ని పూర్తిస్థాయిలో ఓపెన్ చేయడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సొరంగాల్లోకి సాగర్ జలాలు రాకుండా ఉండేందుకు రక్షణగా రిటెయినింగ్ వాల్ నిర్మించారు. నాగార్జున సాగర్ జలాశయం డెడ్‌స్టోరేజీ చేరుకున్నప్పుడు హైదరాబాద్‌కు కృష్ణా జలాల తరలింపు కోసం సుంకిశాల పంప్‌హౌస్‌ను నిర్మించిన విషయం విధితమే. సుంకిశాల సొరంగాల్లోకి సాగర్ జలాలు రాకుండా ఉండేందుకు రిటెయినంగ్ వాల్ నిర్మించారు. నాగార్జునసాగర్‌కు లక్షల క్యూసెక్కుల వరద నీరు వస్తుండడంతో నీటిమట్టం కూడా భారీగా పెరిగిన విషయం తెలిసిందే.



# సంపాదకీయం

శుక్రవారం 09-08-2024

## ఎందుకు వినేశ్ పై వేటు...

100 గ్రాముల బరువు ఎక్కువగా ఉందని వినేశ్ ఫోగట్‌పై అనర్హత వేటు వేసిన వార్త దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇవేం రూల్స్ అని అంతా పెదవి విరుస్తున్నారు. ఈ నిబంధనల విషయంలో వాళ్లు చాలా స్ట్రిక్ట్‌గా ఉన్నారు రెజ్లింగ్ ఫెడరేషన్ కూడా ఇప్పటికే వెల్లడించింది. అయితే...అంతకు ముందు రోజు రాత్రి వినేశ్ ఫోగట్ బరువు తగ్గేందుకు చాలా శ్రమించింది. కానీ అనర్హత వేటు నుంచి తప్పించుకోలేకపోయింది. అసలు ఒలింపిక్స్‌లో ఈ బరువుకి ఎందుకంత ప్రియార్టీ ఇస్తారు..? వినేశ్ ఫోగట్ బరువు తగ్గించుకోడానికి ఎందుకంత కష్టపడింది..? అనే చర్చ కూడా జరుగుతోంది. సాధారణంగా ఒలింపిక్స్‌లో పాల్గొనే క్రీడాకారులకు తమ ఆటను బట్టి వెయిట్ కేటగిరీలు ఉంటాయి. రెజ్లర్లు, బాక్సర్‌లతో పాటు అందరికీ ఇవి వర్తిస్తాయి. రూల్స్ ప్రకారం వాళ్లు చెప్పినంత బరువు మాత్రమే ఉండాలి. కాస్త ఎక్కువున్నా సరే వెంటనే పోటీ నుంచి తప్పించేస్తారు. అందుకే చాలా మంది క్రీడాకారులు ఇలాంటి పోటీల్లో పాల్గొనే ముందు బరువు తగ్గేందుకు తీవ్రంగా శ్రమిస్తుంటారు. కిలోల కొద్దీ బరువు తగ్గిన వాళ్లూ ఉన్నారు. ఇక రెజ్లింగ్ విషయంలో ఈ రూల్స్ మరింత కఠినంగా ఉంటాయి. యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ ప్రకారం రెజ్లింగ్ పోటీ జరిగే ఉదయమే అందరి బరువునీ చెక్ చేస్తారు. అయితే..అంతకు ముందే రెజ్లర్లకు వైద్య పరీక్షలు చేస్తారు. ఆ తరవాత ఒక్కొక్కరి బరువు పరిశీలిస్తారు. మొదటి రోజున దాదాపు అరగంట పాటు వెయిట్ చెక్ చేస్తారు. ఈ అరగంటలో రెజ్లర్లు ఎన్ని సార్లైనా తమ బరువు చెక్ చేసుకోవచ్చు. రెండో రోజున మరో 15 నిముషాల పాటు లివతిణష్ట్ర-తిని ప్రక్రియ జరుగుతుంది. ఈ సమయంలోనే వాళ్ల ప్రమాణాలకు తగ్గట్టుగా లేకపోతే పోటీ నుంచి తప్పిస్తారు. వినేశ్ ఫోగట్ విషయంలో ఇదే జరిగింది. అయితే...సాధారణంగా ఆమె బరువు 55-56 కిలోల వరకూ ఉండేది. ఎప్పుడైతే 50 ఎణ కేటగిరీలో పోటీ చేయాలని నిర్ణయించుకుందో అప్పుడే బరువు తగ్గాల్సి వచ్చింది. అంటే దాదాపు 5-6 కిలోల వరకూ తగ్గిపోవాలి. అందుకే ఆ స్థాయిలో శ్రమించింది. కానీ...డీహైడ్రేషన్‌కి గురైంది. రూల్స్ ప్రకారం పోటీ చేస్తున్న అన్ని రోజుల్లోనూ అథ్లెట్ అదే బరువుని మెయింటేన్ చేయాల్సి ఉంటుంది. సాధారణంగా రెజ్లింగ్ పోటీలు రెండు రోజులు జరుగుతాయి. ఈ రెండు రోజుల్లోనూ వినేశ్ ఫోగట్ బరువు 50 కిలోలుగానే ఉండాలి. కానీ రెండో రోజు 100 గ్రాములు ఎక్కువగా ఉండడం వల్ల ఆమెపై అనర్హతా వేటు వేశారు. బరువు విషయంలో చాలా స్ట్రిక్ట్‌గా ఉన్నారు, సమయం అడిగినా ఇవ్వలేదు - వినేశ్ ఫోగట్ అనర్హతా వేటుపై రెజ్లింగ్‌లో మొదటి రోజు ఫస్ట్ రౌండ్ నుంచి సెమీ ఫైనల్స్ వరకూ జరుగుతాయి. ఆ తరవాత రెండో రోజు ఫైనల్ మ్యాచ్ నిర్వహిస్తారు. రిస్ ఒలింపిక్స్ 2024లో భారత్‌కు పెద్ద షాక్ తగిలింది. మహిళల 50 కేజీల విభాగంలో ఫైనల్స్ కు చేరిన వినేష్ ఫోగట్‌పై అనర్హత వేటు పడింది. ఇంకాసేపట్లో ఫైనల్స్‌లో అమెరికాకు చెందిన రెజ్లర్ సారా హిండెబ్రాండ్ తో ఢీ కొట్టాల్సిన సమయంలో ఆమె డిస్ క్వాలిఫై అయ్యారు. ఫైనల్స్ ఆడటానికి కాసేపటికి ముందు షాకింగ్ వార్త వెలుగులోకి వచ్చింది. వినేష్ ఫోగట్ డిస్‌క్వాలిఫై అయ్యారని భారత ఒలింపిక్స్ కమిటీ అధికారికంగా ప్రకటించింది. ఓవర్ వెయిట్ అంటే.. అధిక బరువు కారణంగా వినేష్ ఫోగట్‌పై అనర్హత వేటు పడింది. నిర్దేశిత బరువు కంటే ఆమె 100 గ్రాములు అధికంగా ఉండటం అనర్హత వేటుకు కారణమైంది. మహిళల రెజ్లింగ్ 50 కేజీల విభాగంలో వినేష్ పోటీ పడుతున్న విషయం తెలిసిందే. ఈ కేటగిరిలో పోటీపడే రెజ్లర్ 50 కేజీలు, లేదా అంతకంటే తక్కువ బరువును కలిగి ఉండాలి. నిబంధనల మేరకు ఓ 100 గ్రాముల మేరకు అధిక బరువును కలిగి ఉండొచ్చు. వినేష్ ఫోగట్ మాత్రం 50 కేజీలకు మించి బరువును కలిగి ఉండడంతో.. అదే ఆమె పై అనర్హత వేటుకు కారణమైందని ఒలింపిక్స్ కమిటీ వెల్లడించింది. మంగళవారం రాత్రి ఆమె రెండు కేజీల వరకు బరువు పెరిగినట్లు తెలుస్తోంది. మొత్తంగా 52 కేజీల బరువును కలిగి ఉన్నట్లు చెబుతున్నారు. దీన్ని 50 కేజీల లోపు వరకు తగ్గించుకునేందుకు మంగళవారం రాత్రంతా నిద్రాహారాలు కూడా మానివేశారు. బరువు తగ్గేందుకు తను చాలా ప్రయత్నించిందంట. రాత్రి గంటలపాటు స్టీమింగ్ రూంలో కూర్చుందంట. రన్నింగ్, స్కిప్పింగ్‌తో పాటు సైక్లింగ్ కూడా చేసిందంట. అలాగే, తన జుట్టు, గోళ్లను కూడా కత్తిరించిందంట. అలాగే రక్తాన్ని కూడా తీసిందట. అయినప్పటికీ ఆమె బరువు 50 కిలోల 100 గ్రాముల కంటే ఎక్కువగా ఉన్నట్లు తేలింది. దీంతో ఆమెపై అనర్హత వేటు పడింది. కాస్తలో బంగారు పతకం మిస్ అయిన వినేష్ విజయం వెనుక ఆమె డైట్ రహస్యం ఏమిటో తెలుసుకుందాం..వినేష్ ఫోగట్ డైట్ ప్లాన్ చాలా కఠినంగా ఉంటుంది. ఆమె స్వీట్లకు, నెయ్యికి చాలా దూరంగా ఉంటుంది. అధిక ప్రోటీన్, పోషకాలను కలిగి ఉన్న ఆహారాన్ని తీసుకుంటారు. ఈ ఆహారం ఆమెకు తక్షణ శక్తిని అందజేస్తుందివినేష్ రోజు ఎల్లప్పుడూ పోషకమైన భోజనంతో ప్రారంభమవుతుంది. ఆమె అల్పాహారంలో సాధారణంగా గుడ్లు, వోట్స్, పండ్లు ఉంటాయి. మధ్యాహ్న భోజనంలో పప్పులు, కూరగాయలు, రోటీలు తింటుంది. ఆమె సాయంత్రం స్నాక్ కోసం డ్రై ఫ్రూట్స్, ప్రోటీన్ షేక్ తీసుకుంటుంది. ఆమె రాత్రి భోజనంలో సూప్, సలాడ్ వంటి తేలికపాటి ఆహారాన్ని ఇష్టపడుతుంది. వినేష్ ఒక్కసారిగా ఎక్కువ ఆహారం తీసుకోరు. ఆమె తన ఆహారాన్ని కొద్ది కొద్దిగా రోజుకు 4-5 సార్లు తింటుంది. ఇది ఆమె జీవక్రియను వేగవంతం చేస్తుంది. వినేష్‌కి పాలు, పెరుగు అంటే చాలా ఇష్టం. రోజూ ఉదయం, సాయంత్రం కలిపి నాలుగు నుంచి ఐదు లీటర్ల పాలు తాగుతుంది. పాలు, పెరుగు ఆమెకు చాలా ముఖ్యమైనవి ఎందుకంటే ఇది ఆమె శరీరానికి శక్తిని ఇస్తుంది. వినేష్ ఫోగట్ బయటి ఆహారం అస్సలు తినరు. ఎప్పుడో ఒకసారి తప్పని పరిస్థితుల్లో తీసుకున్నా వెంటనే అనారోగ్యం పాలవుతుంది.

# పోరాడే బలం లేదు... ధైర్యం లేదు

లండన్, ఆగస్టు 8, (న్యూస్ పల్స్)100 గ్రాముల అధిక బరువుతో ఒలింపిక్ పతకం కోల్పోయి తీవ్ర నిర్వేదంలో ఉన్న భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగాట్ సంచలన ప్రకటన చేసింది. రెజ్లింగ్‌కు రిటైర్‌మెంట్ ప్రకటిస్తున్నట్లు వెల్లడించింది. రిటైర్ మెంట్ ప్రకటన చేస్తూ భావోద్వేగానికి గురైంది. ఇక పోరాడే బలం లేదంటూ రెజ్లింగ్‌కు వీడ్కోలు పలికింది. ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్‌లో వినేశ్ పోస్ట్ పెట్టింది. రెజ్లింగ్ తనపై గెలిచిందని... తాను ఓడిపోయానని ఈ పోస్ట్‌లో వినేశ్ పేర్కొంది. మీ కల, తన ధైర్యం రెండు విచ్ఛిన్నమైయ్యాయని... ఇక తనకు పోరాడే బలం కుడా లేదని వినేశ్ ఆ పోస్ట్‌ల పేర్కొంది. ఈ ప్రకటనతో భారత రెజ్లింగ్‌లో ఓ పోరాట యోధురాలి శకం ముగిసింది. ఒలింపిక్స్‌లో పతకం గెలిచి తన కెరీర్‌కు ఘనంగా ముగింపు పలకాలని భావించిన వినేశ్... ఇప్పుడు తీవ్ర నిర్వేదంతో ఈ అనూహ్య నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. ఒలింపిక్స్‌లో 50 కేజీల మహిళల విభాగంలో ఫైనల్ పోరుకు ముందు 100 గ్రాముల అదనపు బరువుతో అనర్హత గురైన భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగాట్ కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (సీఏఎస్)ను ఆశ్రయించింది. సెమీస్ గెలిచి ఫైనల్‌కు వెళ్లిన తనకు సిల్వర్ మెడల్ ఇవ్వాలని ఫిర్యాదులో కోరింది. దీనికి సంబంధించి సీఏఎస్ ఆగస్టు 8న తీర్పు ఇవ్వనుంది. సీఏఎస్ రూల్స్ వినేశ్‌కు అనుకూలంగా వస్తే భారత్‌కు మరో పతకం క్రీడల్లో వివాదాలకు సంబంధించి ఆర్బిట్రేషన్ కోర్టును 1984లో ఏర్పాటు చేశారు. తను సిల్వర్ మెడల్‌కు అర్హురాలినని ఫిర్యాదులో వినేశ్ పేర్కొందని తెలుస్తోంది. ఆర్బిట్రేషన్ తీర్పు రావాల్సి ఉండగానే వినేశ్ ఈ రిటైర్‌మెంట్ నిర్ణయం తీసుకుని అభిమానులకు వేదనను మిగిల్చింది. యునైటెడ్ ప్రపంచ రెజ్లింగ్ ఒలింపిక్స్ నిబంధనల ప్రకారం రెజ్లింగ్ మ్యాచ్ జరగనున్న రోజు ఉదయం రెజ్లర్ల బరువును కొలుస్తారు. మ్యాచ్ ఆరంభం తొలి రోజు వైద్య పరీక్షలకు, బరువును కొలుచుకునేందుకు రెజ్లర్లకు అరగంట సమయం ఇస్తారు. మంగళవారం వినేశ్ బరువు 50 కేజీల కంటే ఎక్కువ లేకపోవడంతో ఆమె రెజ్లింగ్‌లో బరిలోకి దిగి అద్భుతాలు చేసింది. అయితే బుధవారం ఉదయం వినేశ్ 100 గ్రాముల బరువు ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఒలింపిక్స్, ఆసియా క్రీడలు, ప్రపంచ ఛాంపియన్‌షిప్స్, ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లో ఒక్క గ్రాము అధికంగా ఉన్నా అలాంటి రెజ్లర్లు బరిలోకి దిగేందుకు అర్హత లేదు. అందుకే వినేశ్‌పై అనర్హత వేటు పడింది. కనీసం రజత పతకంతో అయినా భారత్‌కు వస్తుందనుకున్న వినేశ్.. అనర్హురాలిగా తేలి పతకానికి దూరమవడంతో భారత అభిమానులను తీవ్ర ఆవేదనకు గురిచేసింది. మ్యాచ్ రోజున ఎక్కువ బరువు ఉండే రెజ్లర్లను పోటీల నుంచి తప్పించి, చివరి స్థానం ఇస్తారు. భారత రెజ్లర్ వినేశ్ ఫోగాట్‌పై అనర్హత వేటు పడిన అంశంపై ప్యారిస్ ఒలింపిక్స్‌లో బంగారం పతకం గెలిచిన అమెరికా రెజ్లర్ సారా హిల్డర్ బ్రాంట్ స్పందించారు. బుధవారం రాత్రి జరిగిన ఫైనల్‌లో ఆమె క్యూబా రెజ్లర్ గుజ్మన్ లోపేజ్‌పై విజయం సాధించారు. లోపేజ్‌కు రజతం దక్కగా, జపాన్, చైనా రెజ్లర్లు కాంస్యాలు సాధించారు. గెలుపు అనంతరం మాట్లాడిన సారా హిల్డర్... వినేశ్ ఫోగాట్ బరువుపై స్పందించారు. వినేశ్ ఫోగాట్ బాధను తాను అర్థం చేసుకోగలనన్నారు. ఫోగాట్ గొప్ప రెజ్లర్... ఆమెపై అనర్హత వేటు పడటం బాధాకరం అన్నారు. బరువు విషయంలో తాను కూడా చాలా కష్టపడ్డానని, కాబట్టి ఆమె కష్టాన్ని తాను అర్థం చేసుకోగలనన్నారు. ఫోగాట్‌పై అనర్హత విషయం తెలిగానే ఒలింపిక్స్ విజేతను తానే అని భావించానని... కానీ గంట వ్యవధిలోనే లోపేజ్‌తో తలపడాలని తెలిసిందన్నారు. దీంతో తన ఆనందానికి బ్రేక్ పడిందన్నారు. లోపేజ్‌తో పోటీలో గెలిచి తాను పసిడిని అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. తాను కూడా బరువు తగ్గాల్సిన పరిస్థితి ఏర్పడిందని, అందుకోసం ఎంతో సాధన చేశానన్నారు. వినేశ్ విషయంలో ఇలా జరుగుతుందనుకోలేదని అన్నారు. సెమీస్‌లో ఆమె అద్భుతంగా ఆడిందని, అలాంటి రెజ్లర్‌కు ఈ ఒలింపిక్స్ ఇలా ముగుస్తుందనుకోలేదన్నారు. ఆమెకు మద్దతు తెలుపుతున్నానని... రెజ్లర్‌గానే కాకుండా వ్యక్తిగతంగానూ ఆమె మంచి మనిషి అన్నారు. భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగాట్ పారిస్ ఒలింపిక్స్ మహిళల ఫ్రీస్టైల్ రెజ్లింగ్ 50 కిలోల విభాగంలో ఫైనల్ నుంచి అధిక బరువు కారణంగా నిష్క్రమించిన విషయం తెలిసిందే. దీంతో యావత్ భారత్ షాక్‌కు గురయింది. పతకం ఖాయం అనుకున్న సమయంలో ఇలా అర్థాంతరంగా పోటీల నుంచి నిష్క్రమించడం అందరికి షాకిచ్చింది. ఈ క్రమంలో వినేశ్ స్వరాష్ట్రం హర్యానా ఆమెకు మద్ధతుగా నిలిచింది. తాజాగా అక్కడి సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. వినేశ్‌కు రజత పతక విజేతకు దక్కే అన్ని సన్మానాలు, రివార్డులు, సౌకర్యాలు అందిస్తామని ప్రకటించింది. ఈ మేరకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నయాబ్ సైనీ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ప్రకటించారు. వినేశ్ ఛాంపియనేనని ఈ సందర్భంగా ఆమెను హర్యానా ముఖ్యమంత్రి కొనియాడారు. "అద్భుతమైన ప్రదర్శనతో ఫైనల్ వరకు వెళ్లింది. ఏ కారణంతోనైనా ఆమె ఫైనల్ ఆడకపోవచ్చు. కానీ మాకు ఆమె ఛాంపియనే. ఈ నేపథ్యంలోనే మా సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఒలింపిక్ మెడలిస్ట్ మాదిరిగానే ఆమెకు స్వాగతం పలకాలని మా ప్రభుత్వం నిర్ణయించింది. ఒలింపిక్ రజత పతక విజేతకు దక్కే అన్ని సన్మానాలు, రివార్డులు, సౌకర్యాలను వినేశ్‌కు అందిస్తామని" అని తెలిపారు. పంజాబ్‌లోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ (ఎల్‌పీయూ) స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగాట్‌కు రూ. 25 లక్షల నగదు బహుమతిని ప్రకటించింది. పారిస్ ఒలింపిక్స్‌లో ఫైనల్ బౌట్‌కు ముందు ఆమెపై అనర్హత వేటు పడిన తర్వాత ఈ ప్రకటన చేసింది. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఛాన్సలర్ అశోక్ కుమార్ మిట్టల్ మాట్లాడుతూ.. "మాకు వినేశ్ ఇప్పటికీ పతక విజేతే. ఆటపై ఆమె అంకితభావం, నైపుణ్యం చాలా గొప్పవి. ఈ గుర్తింపునకు ఆమె అన్ని విధాల అర్హురాలు. ఆమెకు రూ. 25 లక్షల నగదు బహుమతిని అందించడం మాకు గర్వకారణం" అని అన్నారు. కాగా, తమ విద్యార్థులు ఒలింపిక్స్‌లో స్వర్ణం గెలిస్తే రూ. 50లక్షలు, రజతం గెలిస్తే రూ. 25లక్షలు, కాంస్యం గెలిస్తే రూ. 10లక్షలు ఇస్తామని గతంలో ఎల్‌పీయూ ప్రకటించింది. అందుకే ఫైనల్ వరకు వెళ్లిన వినేశ్‌కు ఇప్పుడు రూ. 25లక్షల రివార్డు ప్రకటించింది. ఇదిలాఉంటే.. వినేశ్ ఫోగాట్‌పై పారిస్ ఒలింపిక్స్ లో ఆఖరి నిమిషంలో అనర్హత వేటు పడిన విషయం తెలిసిందే. మహిళల ఫ్రీస్టైల్ రెజ్లింగ్ 50 కిలోల విభాగంలో ఫైనల్ పోటీలకు ముందు నిర్వాహకులు ఆమె బరువు చెక్ చేశారు. ఆ సమయంలో వినేశ్ 100 గ్రాములు అదనపు బరువుతో ఉన్నట్టు గుర్తించారు. దాంతో ఆమెపై ఒలింపిక్ కమిటీ, రెజ్లింగ్ కమిటీ అనర్హత వేటు వేశాయి. దీంతో పతకం ఖాయం అనుకున్న వినేశ్ ఖాళీ చేతులతో తిరిగి రావాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలోనే ఆమె తన కెరీర్‌కు ముగింపు పలికారు. రెజ్లింగ్‌కు గుడ్‌బై చెబుతూ వినేశ్ ఫోగాట్ కీలక నిర్ణయం తీసుకున్నారు.

## ఐఐటీ మద్రాస్ కు 228 కోట్ల సాయం

చెన్నై, ఆగస్టు 8, (న్యూస్ పల్స్)దేశమేగినా. .ఎందుకాలిడినా...పొగడరా నీ జాతి భూమి భారతిని అన్నాడు ఓ మహాకవి. మనం ఎంత ఎత్తుకు ఎదిగినా పుట్టిన ఊరు, చదువుకున్న పాఠశాల, మన ఉన్నతికి సాయపడిన కళాశాలను అంత తేలిగ్గా మరిచిపోలేం. ప్రవాస భారతీయుల్లో ఇది ఇంకొంచెం ఎక్కువగానే ఉంటుంది. తమన ఇంతటి వారిని చేసిన స్వదేశానికి ఏదో ఒకటి చేయాలని తపిస్తుంటారు. అలాంటి వారిలోనే ఇండోమిమ్ సంస్థ ఛైర్మన్ కృష్ణా చివుకుల ఒకరు. ఆయన ఏకంగా తాను చదువుకున్న కళాశాలకు రూ.228 కోట్ల భూరి విరాళం ఇచ్చారు. అమెరికాలో ఉంటున్న ప్రవాస భారతీయుడు, ఇండోమిమ్ సంస్థ ఛైర్మన్ కృష్ణా చివుకుల ఐఐటీ మద్రాస్‌కు ఏకంగా రూ.228 కోట్ల విరాళం అందజేశారు. దేశంలో ఏ విద్యాసంస్థకు ఇప్పటి వరకు ఇంత భారీ విరాళం వచ్చిన దాఖలాలులేవు. మద్రాస్ ఐఐటీలో ఎంటెక్ చదవుకుని ఆ తర్వాత అమెరికా వెళ్లి సొంతగా కంపెనీ స్థాపించి బాగా గడించిన కృష్ణా చివుకుల...తాను చదివిన కళాశాలకు ఏదైనా చేయాలన్న ఉద్దేశంతో ఇంత భారీ మొత్తంలో విరాళం అందజేశారు. ఈ నిధులతో పేద విద్యార్థులకు ఉపకారవేతనాలు అందించడంతోపాటు. ..క్రీడాకారులకు ప్రోత్సాహం, క్యాంపస్ మ్యాగ్‌జైన్‌ను నిధులు అందించడం సహా మొత్త ఐదు కేటగిరీలకు దాదాపు 25 ఏళ్లపాటు ఖర్చు చేయనున్నారు. స్వదేశానికి సేవ చేయాలని ఎన్నో ఏళ్లుగా అనుకుంటున్న ఆయన...తన ఎదుగుదలకు కారణమైన మద్రాస్ ఐఐటీకి భారీగా విరాళం అందించి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. గుంటూరు జిల్లా బాపట్లలో ఓ సాధారణ మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన కృష్ణా చివుకుల...8వ తరగతి వరకు తెలుగు మీడియంలోనే చదువుకున్నారు. ఆ తర్వాత పదోతరగతి, ఇంటర్ పూర్తి చేసిన ఆయన...1968లో ఐఐటీ బాంబే( నుంచి ఇంజినీరింగ్ పట్టా అందుకున్నారు. అనంతం మద్రాస్ ఐఐటీ నుంచి 1970లో ఏరోస్పేస్ ఇంజినీరింగ్‌లో ఎంటెక్ పూర్తిచేశారు. ఆ తర్వాత అమెరికా వెళ్లి హార్వర్డ విశ్వవిద్యాలయంలో ఎంబీఏ చదివారు. కర్ణాటకలోని తుముకూర్ వర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకున్నా .చదువులో దిట్ట అయిన కృష్ణా..అమెరికాలోని ప్రముఖ హాఫ్‌మన్ సంస్థకు తొలి భారతీయ గ్రూప్ ప్రెసిడెంట్‌గా, సీఈవోగా పనిచేశారు. ఆ తర్వాత న్యూయర్క్‌లో సొంతగా సంస్థను ప్రాంభించి భారత్‌కు విస్తరించారు. భారత్‌కు మెటల్ ఇంజెక్షన్ మౌల్డింగ్ టెక్నాలజీని పరిచయం చేశారు. ఇండో-యూ ఎస్ ఎంఐఎం పేరిట ఓ సంస్థను ప్రారంభించారు. విమానాల విడిభాగాలు తయారు చేసే ఈ సంస్థ ఏడాదికి వెయ్యికోట్ల టర్నోవర్ బిజినెస్ చేస్తోంది. తిరుపతి సమీపంలోనూ ఆయన ఓ పరిశ్రమను ఏర్పాటు చేశారు. ఇప్పుడు దాన్ని మరింత విస్తరించే యోచనలో ఉన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ కింద గతంలోనూ ఆయన ఎన్నో సేవలు అందిచారు. తాను చదువుకునే రోజుల్లో ఉన్న కళాశాల వసతిగృహం కావేరి బ్లాక్‌ను 2020లో రూ.5.5 కోట్లతో ఆధునీకరించారు. 2014లో శాటిలైట్ తయారీకి సాయం అందించారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను ఆర్థికంగా ప్రోత్సహించి ఆదుకున్నారు.

తాజాగా ఇప్పుడు మద్రాస్ ఐఐటీకి రూ. 228 కోట్ల భారీ విరాళం అందజేశారు. ఆయన చేసిన సేవలకు గుర్తుగా ఐఐటీ మద్రాస్‌లోని ఓ అకడమిక్ బ్లాక్‌కు ఆయన పేరు పెట్టారు. గతంలోనూ ఆయన్ను విశిష్ట పూర్వ విద్యార్థి అవార్డుతో సత్కరించింది. అమెరికాలో వ్యాపారులు తాము చదువుకున్న విద్యాసంస్థలకు భారీగా విరాళాలు ఇస్తుంటారని. ..అందుకే తాను చదివిన ఐఐటీ మద్రాస్‌కు విరాళం ఇచ్చినట్లు కృష్ణ చెప్పారు. ప్రఖ్యాత హార్వర్డ్ విశ్వవిద్యాలయ౦ంలో చేరడానికి ఐఐటీ మద్రాస్ కళాశాలే దోహదం చేసిందని...లేకుంటే తాను ఇంత ఎత్తుగా ఎదిగే వాడిని కాదన్నారు.

## యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**తాండూర్ ఎస్సై కిరణ్ కుమార్**

తాండూర్,యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ మాదకద్రవ్యాల వైపు ఆలోచన వస్తే మన తల్లిదండ్రులను గుర్తు చేసుకోవాలని తాండూర్ ఎస్సై కిరణ్ కుమార్ అన్నారు.అనంతరం వారు మాట్లాడుతూ సమాజంలో యువత మంచి, చెడు తెలుసుకొని క్రమ శిక్షణతో మెలగాలని, అప్పుడే నిర్ధేశించుకున్న లక్ష్యాన్ని సాధించి గొప్ప స్థానానికి చేరుకునే అవకాశం లభిస్తుందని అన్నారు. యువత చెడు అలవాట్ల వైపు ఆకర్షితులైతే వచ్చే నష్టాలు, కుటుంబంలో మన తల్లిదండ్రులు, మన కుటుంబీకులు పొందే దుఃఖం వివరిస్తూ చెడు అలవాట్లకు మొదటి నుంచే దూరంగా ఉండాలని తెలిపారు.నేటి యువత రేపటి భావి భారత పౌరులని, డ్రగ్స్‌కు ఆకర్షితులైతే దేశ భవిష్యత్తు నాశనం అవుతుందని, దీనిని గుర్తించి డ్రగ్స్ వల్ల కలిగే విపరీత పరిణామాలపై అవగాహన పెంచుకొని దూరంగా ఉండాలని ఎస్సై సూచించారు. సమాజంలో పెరుగుతున్న సాంకేతికత కారణంగా చిన్న పిల్లలు సెల్ ఫోన్ వాడకం పెరగడం వల్ల ఆలోచనా విధానం మారిపోతుందని, దీని వల్ల అనేక నష్టాలు వస్తున్నాయని అన్నారు. ఒక పరిణతి వచ్చే వరకు సెల్ ఫోన్ ఇవ్వకపోవడం మంచిదని, ప్రతి ఇంట్లో పిల్లల ఫోన్ వాడకంపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలని సూచించారు.యువత డ్రగ్స్‌తో పాటు గుట్కా, గంజాయి, మాదకద్రవ్యాలు, సిగరెట్ మొదలగు చెడు అలవాట్లకు సైతం దూరంగా ఉండాలని, చెడు అలవాట్ల వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని, ఆలోచనా విధానం ఆలోచన శక్తి నశిస్తాయని అన్నారు. తల్లిదండ్రు లు పిల్లలు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకునేందుకు తాము కష్టాలు పడుతూ పిల్లలకు మంచి సౌకర్యాలు కల్పిస్తారని , వా టిని ఎట్టి పరిస్థితుల్లో దుర్వినియోగం చేసుకోవద్దని, మనం చెడు అలవాట్లకు గురైతే తల్లిదండ్రులు పడే క్షోభ వర్ణనాతీతమని, ఇది గుర్తించుకొని యువత మెలగాలన్నారు.

## రెపో రేటు యధాతథం....

ముంబై, ఆగస్టు 8, (న్యూస్ పల్స్)రెపోరేట్‌లో ఎలాంటి మార్పులు చేయడం లేదని ఆర్బీఐ ప్రకటించింది. ప్రస్తుతమున్న 6.5%నే కొనసాగిస్తున్నట్టు వెల్లడించింది. రెపోరేటులో మార్పులు చేయకపోవడం వరుసగా ఇది 9వసారి. ఆర్బీఐకి చెందిన ఆరుగురు సభ్యుల మానిటరీ పాలసీ కమిటీ ఈ నిర్ణయం తీసుకుంది. ఇటీవలే 9వసారి సమావేశమైన కమిటీ పాలసీ రేట్‌లను అదే విధంగా ఉంచాలని భావించింది. అయితే..ఆరుగురు సభ్యుల్లో నలుగురు ప్రస్తుతమున్న రెపోరేటునే కొనసాగించాలని ఓటు వేసినట్టు ఆర్బీఐగవర్నర్ శక్తికాంత దాస్ వెల్లడించారు. "ప్రస్తుతమున్న ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని రెపోరేటుని 6.5% గానే కొనసాగించాలని మానిటరీ పాలసీ కమిటీ నిర్ణయం తీసుకుంది. ఆరుగురు సభ్యుల్లో నలుగురు ఇదే అభిప్రాయానికి మద్దతు పలికారు"

- శక్తికాంత దాస్, ఆర్బీఐగవర్నర్

స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ 6.25% గానే కొనసాగనుండగా మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ, బ్యాంక్ రేటులో ఎలాంటి మార్పులు లేకుండా 6.75%గానే ఉంది. ఈ ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి రేటు 7.2% గా అంచనా వేసింది ఆర్బీఐ. ఇక ద్రవ్యోల్బణ రేటుని 4.5%గా అంచనా వేసింది. అయితే..ఏప్రిల్ మే నెలల్లో ద్రవ్యోల్బణం కాస్త స్థిరంగానే ఉన్నప్పటికీ జూన్‌లో మళ్లీ పెరుగుదల నమోదైంది. ఆహార పదార్థాల ధరలు పెరగడమే ఇందుకు కారణమని ఆర్బీఐ వెల్లడించింది. ప్రస్తుతానికి నైరుతి రుతుపవనాల రాకతో కొంత వరకూ ఈ ధరలు తగ్గుముఖం పడతాయని అంచనా వేసింది. ఆగస్టు 2వ తేదీ నాటికి విదేశీ మారక ద్రవ్య నిల్వలు రికార్డు స్థాయిలో 675 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని ప్రకటించింది. పర్సనల్ లోన్స్‌లో వృద్ధి కనిపిస్తోందని వెల్లడించింది.

## బంగ్లాలో కొలువుదీరనున్న కొత్త ప్రభుత్వం

ఢాకా, ఆగస్టు 8 రాజకీయ సంక్షోభంలో ఉన్న బంగ్లాదేశ్‌లో పరిస్థితులు చక్కదిద్దేందుకు ఇవాళ కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. నోబెల్ బహుమతి గ్రహీత మహ్మద్ యూనస్ ఆధ్వర్యంలో కొత్త ప్రభుత్వం రాత్రి 8 గంటలకు కొలువు దీరింది. పారిస్‌లో ఉన్న యూనర్ స్వదేశానికి చేరున్నారు. ఆయన చేరుకున్న తర్వాత 15 మందితో సలహా మండలి ఏర్పాటు చేశారు. వీళ్లకు సైన్యం కూడా సహకరించేందుకు ఓకే చెప్పినట్టు తెలుస్తోంది. బంగ్లాదేశ్ ప్రజలకు యూనస్ ఓ సందేశాన్ని పంపించారు. ప్రజలంతా శాంతియుతంగా ఉండాలని సూచించారు. దేశాన్ని ప్రగతి పథంలోకి తీసుకెళ్లేందుకు ఇదో గొప్ప అవకాశమని చెప్పుకొచ్చారు. ఇలాంటి పరిస్థితిల్లో హింసను ప్రేరేపిస్తే బాగోదని హితవు పలికారు. సామాన్య ప్రజలకు విద్యార్థులు, పార్టీలు అన్నీ శాంతియుతంగా ఉండి దేశాభివృద్ధిలో భాగమవ్వాలని కోరారు. మరోవైపు బంగ్లాదేశ్‌లో హింస మాత్రం ఆగడం లేదు. సైనిక పాలన సాగుతున్న వేళ లూటీలు జరుగుతున్నాయి. అవామీ లీగ్ నాయకులను టార్గెట్ చేసుకుంటున్నారు ఆందోళనకారులు. ఇలా డజన్ల మందిని హత్య చేసినట్టు మీడియా చెబుతోంది. కొన్ని రోజులుగా హింసకు బలైన వారి సంఖ్య దాదాపు ఐదు వందలకు చేరుకుంది. భారతీయులతోపాటు ఇతర దేశీయులను టార్గెట్ చేసుకుంటున్నారు అల్లరి మూకలు. దీనిపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. జానపద కళాకారుడు రాహుల్ ఆనంద ఇంటిని నేల మట్టం చేశాయి అల్లరి మూకలు. లూటీ చేసి ఆయన ఇంట్లో ఉన్న వస్తువులను ఎత్తుకుపోయారు. సంగీత పరికరాలకు నిప్పు పెట్టారు. విషయాన్ని ముందే తెలుసుకున్న ఆయన కుటుంబంతో కలిసి ఎటో వెళ్లిపోయారు. ఇలా ఇళ్లపైనే కాదు పోలీసు స్టేషన్లపై కూడా దాడులు జరుగుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇలాంటి భయానక వాతావరణంలో పని చేసేందుకు పోలీసులు రావడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న మహమ్మద్ యూనస్‌కు కఠిన సవాళ్లు ఎదుర్కోనున్నాయి. పేదల బ్యాంకర్‌గా పేరున్న ఆయన ఏం చేస్తారని ప్రపంచమంతా ఆసక్తిగా ఎదురు చూస్తోంది. లక్షల మందిని పేదరికం నుంచి తప్పించిన యూనస్ ఇప్పుడు దేశాన్ని ఎలా గట్టెక్కిస్తారనే ప్రశ్న చాలా మందిలో ఉంది.

# బొత్స పోటీ వెనుక వ్యూహం...



విశాఖపట్టణం, ఆగస్టు 8, విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బొత్స సత్యనారాయణ పేరును జగన్ ప్రకటించడం వైసీపీలోనే చర్చనీయాంశం అవుతోంది. దీనికి కారణం అసలు బొత్స సొంత గూడు కాంగ్రెస్‌లోకి వెళ్లే ప్రయత్నాల్లో ఉన్నారన్న ప్రచారం జరుగుతున్న సమయంలో ఈ అభ్యర్థిత్వానికి అంగీకరించడమే. బొత్స కూడా పోటీకి సుముఖత వ్యక్తం చేయలేదని కానీ జగన్ కార్పొరేటర్లతో మీటింగ్ పెట్టి పిలిచి బలవంతంగా అంగీకరింప చేసి ప్రకటించారని అంటున్నారు.ఓటమి తరువాత బొత్స పెద్దగా మీడియా ముందుకు కూడా రావటం లేదు. వచ్చినా నామ మాత్రంగా ప్రెస్ మీట్ పెట్టేసి ముగించేస్తున్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా పోటీచేసేందుకు ఆయన సిద్ధంగా లేకపోయినా జగన్ తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చి ఒప్పించినట్లు వైసీపీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి మొత్తం 841 ఓట్లు ఉన్నాయి. ఇందులో వైసీపీకి 615 ఓట్లు, అధికార కూటమికి 215 ఓట్లు ఉన్నాయి. ఎన్నికల ముందు, కూటమిప్రభుత్వం ఏర్పడిన తరువాత ఉమ్మడిజిల్లాకు చెందిన చాలా మంది వైసీపీ కార్పొరేటర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్లు తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్నారు. వీరంతా స్థానిక సంస్థల శాసనమండలి ఓటర్లే. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బొత్సను పోటీలోకి దింపితే పెద్ద సంఖ్యలో వైసీపీని వీడుతున్న ప్రజా ప్రతినిధులను కట్టడి చేయవచ్చన్నది జగన్ ఉద్దేశం. ఉమ్మడి జిల్లాలోని చాలా మంది వైసీపీ ప్రజా ప్రతినిధులు బొత్స అభ్యర్థిత్వం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇన్నాళ్లు బొత్స, ఆయన కుటుంబం అనేక పదవులు అనుభవించారనీ, ఎన్నికల్లో ప్రజలు గట్టి గుణపాఠం చెప్పినా మళ్లీ బొత్సకు ఎమ్మెల్సీ అవకాశం ఇవ్వడం ఏమిటని అధికశాతం వైసీపీ ప్రజా ప్రతినిధుల ప్రశ్న. ఇప్పటికే వందనంకాకపోగా స్థానిక సంస్థలకు చెందిన వైసీపీ ప్రజాప్రతినిధులు ఆ పార్టీని వీడి తెలుగుదేశం, జనసేన పార్టీల్లో చేరిపోయారు. మరో 200 మంది తెలుగుదేశంలో చేరేందుకు సిద్ధమైనట్లు వైసీపీ వర్గాలే చెబుతున్నాయి. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో నిలిచేందుకు బొత్స సత్యనారాయణ కూడా తొలుత అంగీకరించలేదని బొత్స కాంగ్రెస్ పార్టీలోకి వెళ్తారన్న ప్రచారం జరుగుతుండటంతో ఎలాగైనా బొత్సను ఎమ్మెల్సీ బరిలో నిలిపి పార్టీ మారకుండా కళ్లెం వేయాలన్నది జగన్ ప్లాన్ గా వైసీపీ నేతలు చెబుతున్నారు. బొత్స సత్యనారాయణ ఇప్పటికే కేంద్రంలోని కాంగ్రె స్ పెద్దలతో టచ్ లో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. రాహుల్ గాంధీకి దగ్గర వ్యక్తులుగా ఉన్న కొందరు నేతలు కాంగ్రెస్ పార్టీలోకి వచ్చి షర్మిల ఆధ్వర్యంలో పని చేయాలని బొత్సకు సూచించినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో వైసీపీకోలుకునే పరిస్థితి లేదని భావించిన బొత్ససత్యనారాయణ కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సానుకూలంగా ఉన్నారని అంటున్నారు.ఈ విషయం తెలుసుకున్న జగన్ మోహన్ రెడ్డి, బొత్సను బలవంతంగా ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు ఒప్పించారనివైసీపీ వర్గాలే చెబుతున్నాయి.అన్నీ నేను చూసుకుంటానని బొత్సను జగన్ బరిలోకిదింపారు. జగన్ మాట తీసేయలేక అయిష్టంగానే బొత్స పోటీకి సరే అన్నారనివిశాఖ ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో టాక్ నడుస్తోంది. విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికను తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. దీంతో బొత్సను ఓడించేందుకు తెలుగుదేశం వ్యూహాలు రచిస్తోంది. సోమవారం సాయంత్రం పల్లా శ్రీనివాస్ నివాసంలో అయ్యన్న పాత్రుడు, సీఎం రమేష్, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు భేటీ అయ్యారు. అరకు, పాడేరుకు చెందిన వైసీపీ ఎంపీటీసీ లు, జెడ్పీటీసీ లపై వారు ఫోకస్ పెట్టారు. ఈ సమావేశానికి ఏజెన్సీకి చెందిన 60 మంది వైసీపీ ఎంపీటీసీ, జెడ్పీటీసీలు హాజరయ్యారు. వారిని నేరుగా అమరావతిలో క్యాంపుకు తరలించినట్లు తెలిసింది. కూటమి నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పీలా గోవింద్ పేరును సీఎం చంద్రబాబు నాయుడు దాదాపు ఖరారు చేసినట్లు సమాచారం. బొత్స అభ్యర్థిత్వంపై అసంతృప్తితో ఉన్న కొందరు వైసీపీ ఎంపీటీసీలు, జడ్పీటీసీలు ఇప్పటికే కూటమి పార్టీలో చేరిపోయారు. దీంతో.. ప్రస్తుతం కూటమి అభ్యర్థికి అనుకూలంగా ఉన్న స్థానిక ప్రజాప్రతినిధుల సంఖ్య 500కు చేరినట్లు తెలుస్తోంది. తాజా పరిణామాలతో బొత్స సత్యనారాయణ ఓటమి దాదాపు ఖాయమైనట్లు ఏపీ రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతుంది.

# వైసీపీ జిల్లా అధ్యక్షుల మార్పులు

అనంతపురం, ఆగస్టు 8, ఊహించని పరాభవం తర్వాత వైసీపీని క్షేత్ర స్థాయి నుంచి బలోపేతం చేయడానికి మాజీ సీఎం వైఎస్ జగన్ సన్నాహాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ సమయంలో ముందుగా ఆయన అనంతపురం జిల్లాపై ఫోకస్ పెట్టినట్టు చెప్తున్నారు. 2019 నుంచి అధికారంలో ఉన్న వైసీపీకి జిల్లా రథసారథిగా మొదట శంకర్ నారాయణ కొనసాగారు. జిల్లాల విభజన తర్వాత అనంతపురానికి పైలా నర్సింహయ్య.. సత్యసాయి జిల్లాకు హిందూపురం నేత నవీన్ నిశ్చల్ నియమితులయ్యారు. అయితే ప్రక్షాళనలో భాగంగా జగన్ ఈసారి ఎవరికి బాధ్యతలు అప్పగిస్తారో అని తీవ్రంగా చర్చ జరుగుతోందిఉమ్మడి అనంతపురం జిల్లాలో వైసీపీకి మొదటి నుంచి అండగా ఉంటున్నది రెడ్డి సామాజిక వర్గ నాయకులు. అయితే వైయస్ జగన్మోహన్ రెడ్డి 2019 ఎన్నికల్లో బీసీ కార్డును ముందుపెట్టి ఆ ఎన్నికల్లో అనంతపురం జిల్లాలో 14 ఎమ్మెల్యే స్థానాల్లో 12.. రెండు ఎంపీ స్థానాలు గెలుచుకున్నారు. ఆ రెండు ఎంపీ స్థానాల్లో కూడా ఉమ్మడి అనంతపురం జిల్లాలో బలమైన సామాజిక వర్గాలైన కురుబ, బోయ సామాజిక వర్గాలకు స్థానం కల్పించారు. అన్నీ బాగానే ఉన్నప్పుడు అధ్యక్ష మార్పు గురించి ఎప్పుడు ప్రస్తావన రాలేదు. కానీ 2024 ఎన్నికల్లో ఘోర ఓటమి తర్వాత జిల్లా అధ్యక్షులు మార్పుపై చర్చ రావడంతో ఎవరైతే బాగుంటుందని.. వైసీపీ అధినాయకత్వం మీమాంసలో పడ్డారని భావిస్తున్నారు.వైసీపీ జిల్లా అధ్యక్ష పదవులకు కూడా భారీగానే పోటీ ఉన్నట్లు తెలుస్తోంది. ఇన్నాళ్లు అనంతపురం, సత్యసాయి జిల్లా అధ్యక్ష బాధ్యతలు ఇద్దరు బీసీ నేతలు నిర్వహించారు. దాంతో మళ్లీ పార్టీ అధ్యక్షుడిగా బీసీ నేతలకే ఛాన్స్ ఇవ్వాలని జగన్ భావిస్తున్నారట. రెండు జిల్లాలకు ఒకే సామాజిక వర్గం అయితే మొదటికే మోసం వస్తుందనుకొని ఒక జిల్లాకు బీసీ.. మరో జిల్లాకు ఓసీ అయితే సమతుల్యత ఉంటుందని అనుకుంటున్నారట. అందుకు గాను అనంతపురం జిల్లా పార్టీ అధ్యక్షుడిగా మాజీ మంత్రి శంకర్ నారాయణకు మరోసారి అవకాశం ఇవ్వనున్నట్టు భావిస్తున్నారు. అలానే సత్యసాయి జిల్లాకు ధర్మవరం మాజీ ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డికి అప్పగించే ఛాన్స్ ఉందని టాక్ నడుస్తోంది. దీనిపై త్వరలోనే నిర్ణయం వెలువడనుందని అనుకుంటున్నారు.జిల్లా అధ్యక్షుడిగా పనిచేసేందుకు.. శంకర్ నారాయణ సుముఖంగా లేనట్లు పార్టీలో ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉండగా శంకర్ నారాయణ సత్యసాయి జిల్లా అధ్యక్ష పదవి ఇస్తే పనిచేయడానికి అంగీకరించే అవకాశం ఉందని మరో వాదన బయటకి వస్తోంది. మరోవైపు అనంతపురానికి మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ లలో ఎవరికో ఒకరికి అవకాశం ఇవ్వాలని పార్టీ పెద్దలను కోరుతున్నట్టు టాక్ నడుస్తోంది. ఈ ఐదు సంవత్సరాలు కూటమి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు రాజకీయ అనుభవం ఉన్న నాయకులకు అవకాశం ఇవ్వాలని మరికొందరు కోరుతున్నారని చర్చ జరుగుతోంది.అటు సత్యసాయి జిల్లాకు అధ్యక్షుడిగా.. ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి.. అనంతపురం అర్బన్ మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నాయకుడు అనంత వెంకటరామిరెడ్డి పేరు రేసులో ఉన్నట్టు తెలుస్తోంది. వెంకట రామిరెడ్డి.. సీనియర్ నాయకుడుగా జిల్లా గురించి.. అలానే తాగు, సాగునీటి పట్ల అపార అనుభవం ఉన్న నేపథ్యంలో ప్రభుత్వాన్ని నిలదీయడానికి అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. అయితే వెంకట రామిరెడ్డి జిల్లా అధ్యక్ష పదవితో పాటు వైసీపీలో కీలక పదవుల్లో ఒకటి కావాలని కోరుతున్నారట. మరోవైపు తాడిపత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డి లాంటివారికి జిల్లా అధ్యక్ష పదవి అప్పగిస్తే బాగుంటుందని పలువురు నాయకులు అభిప్రాయ పడుతున్నారు. ఈ క్రమంలో జగన్ అధ్యక్ష బాధ్యతలు ఎవరికి అప్పగిస్తారు తీవ్ర చర్చ జరుగుతోంది. మళ్లీ బీసీ కార్డు తోనే ముందుకు వెళ్తారా.. లేక సమన్యాయం చేస్తారా.. నేతలను సంతృప్తి చేయడానికి పదవితో పాటు కోటరీలో కూడా ఛాన్స్ ఇస్తారా ? అని తెలియాలంటే వేచి చూడాల్సిందే..

## జగన్ భద్రత కోసం 90 కోట్లా....

విజయవాడ, ఆగస్టు 8, గతం మాదిరిగా తనకు భద్రత కల్పించాలని మాజీ సీఎం జగన్ కోరుతున్నారు. న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. గత ఐదేళ్లుగా ఆయనకు అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండేది. కానీ ఏపీ ఎన్నికల్లో ఓటమి తర్వాత సీన్ మారింది. జగన్ కు కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కకపోవడంతో ప్రోటోకాల్ ప్రకారం భద్రతను తగ్గించింది. అయితే రాజకీయ దురుద్దేశంతోనే తనకు భద్రత తగ్గించారని జగన్ వాపోయారు. పలుమార్లు బాహటంగానే ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తరుణంలో తాజాగా ఆయన భద్రతను పెంచేలా ఆదేశాలు ఇవ్వాలని కోర్టును ఆశ్రయించారు. దీంతో ఇది హాట్ టాపిక్ గా మారింది. జగన్ భద్రతపై చర్చ నడుస్తోంది. అసలు జగన్ కు ఎంత మంది భద్రత కల్పించేవారు? దాని కయ్యే ఖర్చు ఎంత? అన్నది ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య దీనిపై వార్ నడుస్తోంది. తాము నిబంధనల మేరకు నడుచుకున్నామని.. అందులో ఎటువంటి సక్సెస్ సాధింపు లేదని ఏపీ హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ప్రకటించారు. ఇందులో ఎటువంటి రాజకీయ దురుద్దేశం లేదని తేల్చి చెప్పారు. అయితే తనకు ఎట్టి పరిస్థితుల్లో జూన్ 3 ముందు ఉన్నట్టుగానే భద్రత కల్పించాలని జగన్ వాదిస్తున్నారు. ఏకంగా హైకోర్టు తలుపు తట్టారు. న్యాయస్థానం తీర్పు ఎలా వస్తుందో చూడాలి. అయితే ఇప్పటికే జగన్ కు భద్రత ఎందుకు తగ్గింది? అందుకు గల కారణాలను ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నివేదించింది. కోర్టుకు తెలియజేయనుంది. న్యాయస్థానానికి అన్ని వివరాలు తెలియజేసింది.జగన్ కు కల్పిస్తున్న భద్రత, అందుకు అయ్యే ఖర్చు వివరాలను బయటపెట్టారు ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణం రాజు. మాజీ సీఎం జగన్ భద్రతకు ఏటా 90 కోట్లు అవసరమా అని ప్రశ్నించారు. మొత్తం 900 మంది భద్రతా సిబ్బందికి నెలకు రూ. 7.50 కోట్లు ఖర్చవుతుందని.. ఏడాదికి 90 కోట్లు ఖర్చు అవుతుందని లెక్కలు చెబుతున్నాయని చెప్పుకొచ్చారు. జగన్ ప్రాణాలకు ప్రజల వల్ల ముప్పు లేదని.. ప్రతిపక్షంలో ఉన్న ఆయన ప్రజలతో కలిసి వెళ్లాల్సిన సమయం వచ్చిందన్నారు. 900 మంది సెక్యూరిటీని పెట్టుకుంటే ఆయన ఎక్కడికి వెళ్ళగలరని?ప్రజలను ఎలా కలుస్తారని? ఆయనను ఎవరు ముట్టుకుంటారని రఘురామకృష్ణంరాజు ఎద్దేవా చేశారు.అంతటితో ఆగని రఘురామ విదేశాల్లో ఉన్న ఆయన కుమార్తెలకు భద్రత అవసరమా అంటూ ప్రశ్నించారు.మరోవైపు ఈ ఘటనపై హోం మంత్రి వంగలపూడి అనిత సైతం స్పందించారు. ఓ మాజీ ముఖ్యమంత్రికి 980 మందితో భద్రత అవసరమా అని ప్రశ్నించారు. భద్రతా సిబ్బంది సంఖ్య చూస్తే ఓ చిన్న గ్రామం ఓటర్లతో సరిపోతుందని ఎద్దేవా చేశారు. సీఎం స్థాయిలో భద్రత ఎలా కల్పిస్తామని ప్రశ్నించారు. జగన్ కు కోడి కత్తి కేసు ఇప్పుడు గుర్తుకొచ్చిందా అని నిలదీశారు. ప్రస్తుతం హోమ్ శాఖ మంత్రి అనిత చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి.

## లంక గ్రామాల తాగు నీటి సమస్య తీరుస్తాం -ఎమ్మెల్యే చింతమనేని

ఏలూరు,ఏలూరు రూరల్, కొల్లేటి గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న త్రాగునీటి సమస్యను పరిష్కరించేలా చర్యలు చేపడతామని లంక గ్రామాల ప్రజల కు అన్ని విధాల కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు.మీకోసం మీ చింతమనేని కార్యక్రమంలో భాగంగా ఏలూరు రూరల్ మండలం లోని ప్రతి కోళ్ల లంక, పైడిచింతపాడు, కొక్కిరాయ లంక గ్రామాల్లో స్థానిక నాయకులు అధికారులతో కలిసి దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పర్యటించారు. ఈ సందర్భంగా తమ గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కు కూటమి నాయకులు, అభిమానులు, కార్య కర్తలు, పూల జల్లులతో, మంగళ వాయిద్యాలతో, పుష్పగుచ్ఛాలతో, మహిళల మంగళహారతులతో, భారీ గజమాలతో ఘన స్వాగతం పలికారు.గ్రామంలో నెలకొని ఉన్న రోడ్లు, డ్రైనేజీలు, ఫించన్లు మంజూ రు సహా పలు ప్రజా సమస్యలను గ్రామస్తులు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దృష్టికి తీసుకురాగా సత్వరమే వాటిని పరిషిష్కరించెల చర్యలు చేపట్టాలని అధికారులకు చింతమనేని ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా దెందులూ రు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ కొల్లేటి లోని పలు లంక గ్రామాల ప్రజలు త్రాగునీటి కొరతతో ఇబ్బంది పడుతున్నారని, వారానికి ఒకసారి కూడా త్రాగు నీరు సరఫరా జరగకుండా ఇబ్బంది పడుతున్నారంటే లంక గ్రామాలు పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో తెలుస్తుందని అన్నారు. సత్వరమే త్రాగు నీటి సమస్యను పరిష్కరించటానికి అధికారులు చర్యలు తీసుకోవాలని, పైప్ లైన్ నిర్మాణాలు చేపట్టటానికి అంచనా లు సిద్దం చేసి పనులు సత్వరమే జరిగేలా చూడాలని ఆదేశించారు. గ్రామాల్లో 4దశాబ్దాల పైగా నివాసం ఉంటున్న గ్రామస్తులకు గ్రామ వాటాల విషయంలో అన్యాయం జరగకుండా గ్రామ పెద్దలు చొరవ చూపాలని చింతమనేని సూచించారు. లంక గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు.



## జగన్ లో ఊహించని మార్పు...

గుంటూరు, ఆగస్టు 8, వైసీపీ అధినేత జగన్ కొత్త ప్లాన్ ఏంటి? చంద్రబాబు సర్కార్‌ను ఇబ్బందిపెట్టడమేనా? జగన్ వేసిన కొత్త పాచికలు వర్కవుట్ అయ్యేనా? మళ్లీ బూమరాంగ్ అయ్యేనా? జగన్ ఎత్తుకు సీఎం చంద్రబాబు పైఎత్తు వేస్తున్నారా? ఇంతకీ ఆ స్కెచ్ ఏంటి?వైసీపీ అధినేత, మాజీ సీఎం, పులివెందుల ఎమ్మెల్యే జగన్ కొత్త స్కెచ్ వేశారు. మా పార్టీ కార్యకర్తలపై పదే పదే దాడులు జరుగుతున్నాయంటూ చెప్పే ప్రయత్నం చేస్తున్నారు మాజీ సీఎం. అంతర్గతంగా ఏపీలో ఎలాంటి దాడులు జరగకపోయినా.. టీడీపీ నేతలు, కార్యకర్తలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నట్టు కనిపిస్తోంది. ఒకవేళ టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోతే దాన్ని భూతద్దంలో చూపించాలన్నది అసలు ఆలోచన.జగన్ ఎత్తుగడలను ముందే పసిగట్టిన సీఎం చంద్రబాబు.. నేతలను, కార్యకర్తలను శాంతపరిచే ప్రయ త్నం చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ దాడులకు దిగవద్దని, చట్ట ప్రకారం వారిపై చర్యలు తీసుకుందామని చెబుతున్నారు. ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. కార్యకర్తల కంటే ముందు.. ఆ పార్టీ నేతలపై కూటమి సర్కార్ దృష్టిపెట్టింది. ఆ దిశగా అడుగులు వేస్తోంది.డిప్యూటీ సీఎం పవన్ సైతం కేడర్‌ను సముదాయిస్తున్నారు. ప్రజలు గెలిపించింది రివేంజ్ తీర్చుకునేందుకు కాదని, మంచి పాలన అందిస్తారని భావిస్తున్నారని గుర్తు చేస్తున్నారు. గతంలో మనల్ని ఇబ్బందులు పెట్టినవారిపై కచ్చితంగా చర్యలు తప్పవని కుండబద్దలు కొట్టేశారు.జగన్ మీడియా ముందుకు వచ్చిన ప్రతిసారీ నవ్వుకోవడం ఏపీ ప్రజల వంతైంది. కూటమి ప్రభుత్వంఅధికారంలోకి వచ్చి దాదాపు రెండు నెలలు అవుతోంది. ఇప్పటవరకు 30కి పైగానే హత్యలు జరిగాయంటూ మీడియా ముందు తెగ గగ్గోలు పెడుతున్నారు అధినేత. అల్లరి మూకల దాడిలో గాయపడిన కార్యకర్తలను మంగళవారంవిజయవాడలోజగన్ పరామర్శించారు.హత్యకు గురైనవారి జాబితా ఇవ్వాలని మీడియా పదేపదే అడిగినప్పటికీ దాని నుంచి తప్పించుకునే ప్రయత్నం చేశారు.. చేస్తున్నారు పులివెందుల ఎమ్మెల్యే. నేతలు, బాధిత కుటుంబాలను పరామర్శించ డానికి వెళ్లిన జగన్.. కేవలం 30 సెకన్లు మాత్రమే గురించి మాట్లాడారు. మిగతా 10 నిమిషాలు ఎప్పటి మారిదిగానే తమ ప్రభుత్వ పథకాల గురించి చెప్పడంతో.. నవ్వుకోవడం ప్రజల వంతైంది.మీడియా ముందుకు వచ్చిన ప్రతిసారీ జగన్ కాస్త ఇబ్బందిపడుతున్నట్లు కనిపిస్తున్నారు. ఒకప్పుడు నవ్వుతూ కూల్‌గా చెప్పాల్సిన నాలుగు మాటలు చెప్పేవారు. ఇప్పుడు అది మచ్చుకైనా కనిపించలేదని, మరి విషయం ఏంటో తెలీదంటున్నారు. జగన్‌కు ఏమైనా సమస్యలు ఉండే వుండవచ్చని ప్రత్యర్థుల నుంచి సెటైర్లు పడిపోతున్నాయి. మొత్తానికి జగన్ వేస్తున్న కొత్త పాచికలు సీఎం చంద్రబాబు ముందు చిత్తవుతున్నట్లు కనిపిస్తున్నాయి.

## ఇక కొలిక్కి రానున్న వివేకా హత్య కేసు

కడప, ఆగస్టు 8, త్వరలోనే న్యాయం గెలవబోతోంది. ఇన్నేళ్ల నిరీక్షణకు సత్ఫలితాలు రానున్నాయి. త్వరలోనే దోషులకు శిక్ష పడనుంది. ఈ కేసులో సీబీఐ చేయాల్సింది చాలా ఉంది. హత్యలు చేయించిన వారు చట్టసభల్లో ఉండకూడదు. " అని వైఎస్ వినేకానందరెడ్డి కుమార్తె వైఎస్ సునీత అమరావతిలో ఏపీ హోంమంత్రి వంగలపూడి అనితతో సమావేశం తర్వాత వ్యాఖ్యానించారు. తన తండ్రి హత్య కేసులో చివరికి నిందితులకు శిక్ష పడుతుందని ఆమె గట్టి నమ్మకానికి వచ్చారు. సునీతకు అంత నమ్మకం ఎలా కలుగుతోంది ?. ఏపీ ప్రభుత్వం ఈ కేసులో కొత్తగా ఏమైనా చేయబోతోందా ? వైఎస్ వివేకా హత్య కేసు ప్రస్తుతానికి ఎక్కడిదక్కడే ఉంది. సుప్రంకోర్టు గతంలో గత ఏడాది జూన్ 30 తేదీలోపు దర్యాప్తు పూర్తి చేయాలని సీబీఐని ఆదేశించింది. ఆ మేరకు సీబీఐ దర్యాప్తు పూర్తి చేసి వివరాలను సుప్రీంకోర్టుకు సీల్డ్ కవర్‌లో సమర్పించింది. అయితే ఇంకా దర్యాప్తు చేయాల్సి ఉందని సీబీఐ చెబుతోంది. అ అంశంపై ఇంకా సుప్రీంకోర్టులో విచారణ జరగాల్సి ఉంది. అదే సమయంలో వివేకా హత్య కేసులో అవినాష్ రెడ్డి, గంగిరెడ్డిల బెయిల్ రద్దు చేయాలంటూ సునీత దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ జరగాల్సి ఉంది. ఇంకా విచారణకు రాలేదు. సీబీఐ కోర్టులో ప్రస్తుతం విచారణ జరుగుతున్నా ఇంకా పూర్తి స్థాయి ట్రయల్ ప్రారంభం కాలేదు. నిందితులకు బెయిల్ కూడా లభించడం లేదు. తాజాగా కీలక నిందితునిగా ఉన్న ఉమాశంకర్ రెడ్డి బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించారు. అంతకు ముందు తనను నిందితుడు, అనుమానితుడు జాబితా నుంచి తొలగించి సాక్షుల జాబితాలో చేర్చాలని దాఖలైన పిటిషన్‌కు అనుకూలంగా తీర్పు వచ్చింది. సీబీఐ ఇంకా దర్యాప్తు చేయాల్సి ఉన్నదని చెబుతోంది. ఇప్పటికైతే సుప్రీంకోర్టు ఇచ్చిన గడువు ముగియడంతో అప్పటి వరకూ వివరాలు సమర్పించి సైలెంట్ గా ఉన్నారు. సుప్రీంకోర్టు నుంచి వచ్చే తదుపరి ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకోనున్నారు. ఈ విషయంలో నిందితులకు ఖచ్చితంగా శిక్ష పడేలా చూడాలన్న లక్ష్యంతో ఉన్న వైఎస్ సునీత సుప్రీంకోర్టులో సీనియర్ లాయర్లతో వాదనలు వినపిస్తున్నాయి. ఈ క్రమంలో సునీత.. సుప్రీంకోర్టులో సీబీఐ విచారణకు మరి కొంత సమయం ఇవ్వాలని కోరే అవకాశాలు ఉన్నాయి. అమరావతిలో సునీత మాట్లాడినప్పుడు ఈ కేసులో ఇంకా సీబీఐ చేయాల్సింది చాలా ఉందని చెప్పారు. అంటే ఆ దిశగా ఆమె కొత్త ప్రయత్నాలు చేసే అవకాశాలు ఉన్నాయి. ఏపీలో ప్రభుత్వం మారింది. అయితే విచారణ ప్రభుత్వం చేతుల్లో లేదు. కనీసం విచారణ జరిగే కోర్టులు కూడా ఏపీలో లేవు. అయితే.. హత్య జరిగింది ఏపీలో కాబట్టి.. దర్యాప్తునకు ప్రభుత్వ సహకారం పూర్తి స్థాయిలో అవసరం ఉంది. గత ప్రభుత్వం ఏ మాత్రం సహకరించలేదన్నది బహిరంగసత్యం. దర్యాప్తు చేస్తున్న సీబీఐ అధికారుల మీదనే కేసులు నమోదు చేశారు. అవినాష్ రెడ్డిని అరెస్టు చేసేందుకు ప్రయత్నించినప్పటికీ కర్నూలు పోలీసులు సహకరించకపోవడంతో అరెస్టు చేయలేకపోయారు. ప్రభుత్వంలోని పెద్దలు సీబీఐ అధికారులపై తీవ్ర ఆరోపణలు చేశారు. చివరికి సునీత విచారణను తెలంగాణ హైకోర్టుకు మార్చాలని సుప్రీంకోర్టుకు వెళ్లి విజయం సాధించారు. కొత్తగా దర్యాప్తు చేసే విషయంలో సీబీఐకి ఎలాంటి సహకారం కావాలన్నా పూర్తి స్థాయిలో ఏపీ ప్రభుత్వం సహకరిస్తుంది. అందులో సందేహం లేదని అనుకోవచ్చు. వైఎస్ వివేకా హత్య కేసులో రాజకీయ కోణాలు ఉన్నాయని సీబీఐ చెబుతోంది. అందుకే ఈ కేసును వీలైనంత వేగంగా కొలిక్కి తీసుకు వచ్చి ప్రజలకు వ్యవస్థలపై నమ్మకం పెంచాలన్న అభిప్రాయాలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఈ దిశగా త్వరలో సీబీఐ మరోసారి విచారణ జరపడం.. ఈ సారి ఆటంకాలు లేకుండా వేగంగా దర్యాప్తు పూర్తి చేసి .. నిందితుల్ని జై?కు పంపడం ఖాయమని భావిస్తున్నారు. ఈ విషయంలో వచ్చే రెండు, మూడు నెలల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటాయని అంచనా వేస్తున్నారు. వైఎస్ సునీత కూడా అదే నమ్మకంతో ఉన్నారు.

# నేడు సితారాంపురానికి జగన్ రాక

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 08 – సీతారాంపురం గ్రామంలో హత్యా ఘటనలో మృతి చెందిన సుబ్బరాయుడు కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు శుక్రవారం మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి రానున్నారు. ఈ మేరకు కార్యక్రమానికి సంబంధించి నంద్యాల పట్టణంలోని ఉదయానంద రెసిడెన్సి నందు గురువారం మధ్యాహ్నం వైఎస్సార్సీపీ రీజనల్ కోఆర్డినేటర్ ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు . మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, మాజీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రనాథరెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు భూమా కిషోర్ రెడ్డి ,సూర్యనారాయణరెడ్డి ఇతర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ.. వైఎస్సార్సీపీ కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉండాలని రాష్ట్ర వైఎస్సార్సీపీ అధ్యక్షుడు మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి స్థానికంగా ఉన్న మాజీ ఎమ్మెల్యేలకు, ఎంపీలకు, స్థానిక నాయకులకు దిశానిర్దేశం చేశారని తెలిపారు. తాము వారికి అండగా ఉంటామన్నారు. వైఎస్సార్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ...మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి సీతారాంపురం గ్రామానికి శుక్రవారం రానున్నారని, ఉదయం 10.30 గంటలకు ఓర్వకల్ ఎయిర్ పోర్ట్ నుండి రోడ్డు మార్గంలో సీతారామపురం గ్రామానికి మధ్యాహ్నం 12.30 గంటలకు చేరుకొని హత్యాకాండలో మృతి చెందిన పెద్ద సుబ్బరాయుడు కుటుంబ సభ్యులను పరామర్శించి అటుతర్వాత నంద్యాల చేరుకొని మాజీ ఎంపీ కార్యాలయంలో వైఎస్సార్సీపీ మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, నాయకులతో సమావేశం నిర్వహించి రోడ్డు మార్గంలో నేరుగా ఓర్వకల్లు



విమానాశ్రయానికి చేరుకొని బయలు దేరతారని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ. సీతారాంపురం గ్రామంలో పెద్ద సుబ్బరాయుడును హత్య చేసిన టీడీపీ నాయకుడు బుడ్డారెడ్డి శ్రీనివాసరెడ్డికి 1991 నుండి ఎంతో నేరచరిత్ర ఉందని హత్యలు, ఫోర్జరీ సంతకాలతో భూ కబ్జాలు, 59 కేసులు ఉన్నాయన్నారు. సీఎం చంద్రబాబు ఇప్పటికైనా ఈ దాడులను ఆపేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. .

## మళ్లీ పెళ్లి సందడి మొదలైంది

### శ్రీ యాదవల్లి కార్తికేయ శర్మ



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 08-శ్రావణం రాకతో మళ్లీ పెళ్లి సందడి మొదలైందని శ్రీ యాదవల్లి కార్తికేయ శర్మ పేర్కొన్నారు. ఆయన గురువారం మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. శ్రావణం రాకతో కళ్యాణ మండపాలకు సందడి తెచ్చిందన్నారు. మూడు నెలల విరామం తర్వాత పెద్ద ఎత్తున పెళ్లిళ్లు జరగనున్నాయి.నిన్న బుధవారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు 16 ముహూర్తాలు ఉన్నట్లుగా శ్రీ యాదవల్లి కార్తి కేయ శర్మ తెలిపారు. సెప్టెంబర్ లో వివాహాలకు మళ్లీ విరామం పడనుందన్నారు. అప్పుడు అన్నప్రాసనాది ముహూర్తాలే ఉన్నాయని చెప్పారు . ఈ శ్రావణ మాసంలో ఈ నెల 7, 8, 9, 10, 11, 13, 14, 15, 17, 18, 19, 22, 23, 24, 26, 28వ తేదీలు పెళ్లిళ్లకు అనుకూలం. సెప్టెం బర్ లో ముహూర్తాలు లేవు. మళ్లీ అక్టోబర్ లో ప్రారం భమై, 2025 ఏప్రిల్ వరకు ఉన్నాయి. దీంతోపాటు ఈ నెల 9న నాగుల పంచమి, 16 న వరలక్ష్మి వ్రతం, 19న రాఖీ పౌర్ణమి, 27న కృష్ణాష్టమి, వంటి ఫెస్టివల్స్ కూడా ఉన్నాయని తెలిపారు.

## ఘనంగా నాగుల చవితి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 08-నాగుల చవితి పర్వదినంను పురస్కరించుకొని నంద్యాల మండలం మేజర్ గ్రామ పంచాయతీ కానాల గ్రామంలో వెలిసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్య స్వామి దేవస్థానంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టకు పాలుపోసి స్వామివారికి పూజలు చేసి తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. నంద్యాల పట్టణంతో పాటు చుట్టుప్రక్కల గ్రామాల నుంచి వచ్చిన అనేక మంది భక్తులు ఈ పూజలలో పాల్గొన్నారు.

## మద్దిలేరు వాగులో గుర్రపు డెక్క తొలగింపు



-విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 08-హరిజన వాడ వద్ద ఉన్న మద్దిలేరు బిడ్జీ వద్ద గురువారం గుర్రపు డెక్కను జేసీబీతో మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి తొలగించారు. కమిషనర్ మాట్లాడుతూ మద్దిలేరు వాగులో గుర్రపు డెక్క పెరిగిం దని దాని వల్ల నీటి పారుదల నెమ్మదిగా సాగుతుందని ప్రజలకు అటు రైతులకు గుర్రపు డెక్క వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు . వాటిని వెంటనే శుభ్రం చేయిస్తున్నామని తెలిపారు. కమిషనర్ వెంట మున్సిపల్ డీఈ మదు కుమార్. సచివాలయ సిబ్బంది ఉన్నారు .

## నల్లగట్ల స్కూల్ కమిటీ ఛైర్మన్ గా ఎమ్. లింగమయ్య



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 08-. ఆళ్లగడ్డ మండలం నల్లగట్ల గ్రామం లోని మండల ప్రాథమిక పాఠశాలలో గురువారం జరిగిన విద్యాకమిటి ఎన్నికల్లో టిడిపి పార్టీకి చెందినవారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు . విద్యకమిటీ చైర్మన్ గా ఎమ్ .లింగమయ్య , వైస్ చైర్మన్ గా జె. లావణ్య లను ఎన్నుకోవడం జరిగిందని స్కూల్ హెడ్ మాస్టర్ భార్గవ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలతో పాటు తెలుగు దేశం పార్టీ నాయకులు అనుముల నాగరాజు, ఎస్ . బాలగుర్రప్ప, లక్ష్మి రెడ్డి, వీర భద్రుడు ఉన్నారు. అనంతరం ఎన్నికైనా వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. స్కూల్ కమిటీ ఛైర్మన్ ఎమ్. లింగమయ్య మాట్లాడుతూ పాఠశాల అభిరుద్ధికి కృషి చేస్తానని తెలిపారు. గ్రామ టీడీపీ నాయకులకు గ్రామ ప్రజలకు ఎమ్ లింగమయ్య కృతజ్ఞతలు తెలియజేశారు .

# ప్రతి శాఖ వంద రోజులు, ఏడాది, 5 ఏళ్ల కాలానికి లక్ష్యాలతో కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలి

**కార్యాచరణ ప్రణాళికలకు అనుగుణంగా లక్ష్యాలు సాధించాలి**
**జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**



కర్నూలు, ఆగస్టు 08:-×ప్రతి శాఖ వంద రోజులు, ఏడాది, 5 ఏళ్ల కాలానికి లక్ష్యాలతో కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో వంద రోజుల ప్రణాళిక, ఏడాది ప్రణాళిక, 5 ఏళ్ల కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనపై జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వంద రోజుల ప్రణాళిక, ఏడాది ప్రణాళిక, 5 ఏళ్ల కార్యాచరణ ప్రణాళిక పై ముఖ్యమంత్రి గారు ప్రతి నెలా నిర్వహించనున్న కలెక్టర్ల సదస్సులో సమీక్ష చేయనున్నారన్నారు. అందువల్ల 100 రోజులు, ఏడాది, 5 ఏళ్లలో ఏమేమి చేయగలమో లక్ష్యాలు నిర్ణయించుకుని, వాటిని సాధించే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు.. ఇందుకు సంబంధించి నిధుల అవసరం, ప్రభుత్వ సహకారం గురించి కూడా ప్రణాళికలో రూపొందించాలన్నారు..ఈ సందర్భంగా అన్ని శాఖల ప్రణాళికలను పరిశీలించి కలెక్టర్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు..ఇరిగేషన్ డిపార్ట్మెంట్ కు సంబంధించిన ప్రాజెక్టులకు మరమ్మత్తులు,రిజర్వాయర్లను, మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు నింపడం,ఆయకట్టుకు నీరు ఇవ్వడం తదితర అంశాలను ప్రణాళికల్లో చేర్చాలన్నారు..పరిశ్రమలకు సంబంధించి ఓర్వకల్లు ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి, సింగిల్ విండో అనుమతులు, పి పి పి బేస్డ్ ప్రాజెక్ట్స్ ఎక్కడ చేయొచ్చు అనే అంశాల మీద పరిశ్రమల శాఖ, ఏపీఐఐసీ సమన్వయంతో యాక్షన్ ప్లాన్ రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు.. హౌసింగ్ కి సంబంధించి నాట్ స్టార్టెడ్ ఇళ్ల నిర్మాణాలు మొదలు పెట్టే విధంగా, ముఖ్యంగా రూఫ్ కాస్ట్ లో ఉన్న ఇళ్లను పై ప్రత్యేక శ్రద్ధ వహించి పూర్తి చేసే దిశగా లక్ష్యాలు నిర్ణయించుకోవాలన్నారు.. వ్యవసాయానికి సంబంధించి ఈ క్రాప్ బుకింగ్, సి ఆర్ సి కార్డ్స్ , పొలం బడి, రుణాల మంజూరు తదితర అంశాలపై దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు ..హార్టికల్చర్ కి సంబంధించి ఎక్స్పోర్ట్ చేసే పండ్లను ఇక్కడ పండించే విధంగా చర్యలు తీసుకోవడంతో రైతులకు ఎంతో లబ్ధి చేకూరుతుందని, ఒక్క రైతును చూసి ఇంకొక్క రైతు కూడా అదే పంటను వేసి లాభాలను పొందుతారని కలెక్టర్ హార్టికల్చర్ అధికారికి సూచించారు..జిల్లాలో పండించే ఉత్పత్తులను రైతులకు లాభం కలిగే విధంగా నేరుగా మార్కెటింగ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్, డి ఆర్ డి ఎ శాఖల అధికారులకు కలెక్టర్ లక్ష్యాలు నిర్దేశించారు..ఎనర్జీ కి సంబంధించి కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా రాయితీపై ప్రభుత్వ కార్యాలయాలన్నింటిపై సోలార్ ప్లాంట్ లో ఏర్పాటు, వేలాడే విద్యుత్ తీగల తొలగింపు తదితర అంశాలను లక్ష్యాలుగా నిర్ణయించుకోవాలన్నారు... గ్రామ పంచాయతీలో 250 నుండి 500 మంది ఉన్న జనాభా ఉండే 10 గ్రామ పంచాయతీల్లో 5 ఎకరాలో ప్రభుత్వ భూమిలో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు..అలాగే పది సిపిడబ్ల్యూఎస్ స్కీములకు కూడా సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.. సోలార్ ఏర్పాటు ద్వారా ప్రజలకు ఉచితంగా విద్యుత్ ఇచ్చేందుకు వీలవుతుందన్నారు.. పంచాయితీ ల మీద విద్యుత్ కి సంబంధించిన అధిక బిల్లులు వచ్చే అవకాశం ఉండదని కలెక్టర్ పేర్కొన్నారు.. విద్యా శాఖకి సంబంధించి గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో 100 శాతం సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీఈవో ను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి విద్యా వాలంటీర్ లను నియమించేందుకు గైడ్లైన్స్ రాగానే వారిని నియామకం చేయాలన్నారు.. పాఠశాలల్లో 10 వ తరగతి పూర్తైన విద్యార్థులు వెంటనే ఇంటర్మీడియట్ లో చేరారా? లేదా? అని సంబంధిత విద్యార్థుల వ తల్లి తండ్రులతో మాట్లాడి వారు ఇంటర్మీడియట్ ఎక్కడ జాయిన్ అయ్యారనే వివరాలను తెలుసుకొని యాప్ లో అప్డేట్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్న బడి భోజనంలో విద్యార్థుల హాజరు తక్కువగా ఉందని పురోగతి సాధించే దిశగా చర్యలు తీసుకోవాలని డి ఈ ఓ ను కలెక్టర్ ఆదేశించారు.అటవీ, డ్వామా శాఖల నుండి ప్లాంటేషన్ పనులు ఎక్కువగా జరగాలన్నారు. బాపట్లలో 2 లక్షల 22 వేల మొక్కలు ఒక్కటే రోజు నాటినామని, అదే తరహాలోనే ఇక్కడ కూడా ప్లాంటేషన్ చేసే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు.. కేంద్ర ప్రభుత్వం నగరవనం నగరవాటికలకు నిధులు అందజేస్తుందని, అందువల్ల కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని మున్సిపాలిటీ లో నగర వనం, నగర వాటికలు ఏర్పాటు చేసేందుకు స్థలాలను గుర్తించాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. స్కిల్ డెవలప్మెంట్, ఉపాధి కల్పన, యూత్ విభాగం శాఖలు ఉద్యోగ వివరాలను నిరుద్యోగ యువతకు తెలిసేలా ఒక పోర్టల్ డిజైన్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.. ఈ పోర్టల్ లో నిరుద్యోగ యువత, ఉద్యోగ సమాచారం రెండూ అనుసంధానం చేయాలన్నారు.. సాంఘిక సంక్షేమం, బిసి సంక్షేమం, మైనారిటీ, ట్రైబల్ శాఖలకు సంబంధించిన వసతి గృహాల్లో టాయిలెట్ రిపేర్స్ కి సంబంధించిన ప్రతిపాదనలను పంపాలన, అదే విధంగా ముఖ్యంగా గర్ల్స్ హాస్టల్ కి అవసరమైన కాంపౌండ్ వాల్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు కూడా పంపాలన్నారు. ప్రతి హాస్టల్ కి మండల స్పెషల్ ఆఫీసర్ అపాయింట్ చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎఎన్ఎమ్, మెడికల్ ఆఫీసర్ లు వెళ్లి విద్యార్థుల ఆరోగ్యాన్ని పరీక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని డి ఎం హెచ్ ఓ ను కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా హెల్త్ క్యాంప్స్ తో పాటు ఆరోగ్య సమస్యల పై కౌన్సెలింగ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్యశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మహిళా పోలీస్ లు వసతి గృహాలను తనిఖీ చేసి బాలికల సమస్యలను తెలుసుకోవాలన్నారు.. ఐసిడిఎస్ కి సంబంధించి బాల్య వివాహాలు ఎక్కువగా జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు..కేంద్ర ప్రభుత్వం నుండి అనాథ పిల్లలకు వచ్చే 4 వేల రూపాయలకు సంబంధించిన బిల్లును 427 కి గాను 167 మందివి మాత్రమే ఎందుకు అప్లోడ్ చేశారని ఇన్చార్జ్ ఐసిడిఎస్ పిడి ని కలెక్టర్ ప్రశ్నించారు.. ఈ విషయం పై ఎంక్వైరీ చేసి తగిన నివేదికలు సమర్పించాలని డి ఆర్ ఓ ను కలెక్టర్ ఆదేశించారు..సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కి సంబంధించి 484 గ్రామ పంచాయతీలకు గాను 372 షెడ్ లు పూర్తయ్యాయని మిగిలిన షెడ్ లను కూడా త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా సంబంధిత షెడ్ లలో ఏదైనా వాటర్, పవర్ సప్లై సమస్య ఉంటే వాటి వివరాలను కూడా ఇవ్వాలని, షెడ్ లు అక్టోబర్ లోకి ఆపరేషన్ లోపు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లాలో గంజాయి లాంటి మత్తుపదార్థాలు వాడకుండా కళాశాలలు, పాఠశాలలు, హాస్టల్ సముదాయాల్లో ఉండే షాప్ లను తనిఖీ చేయాలని సెబ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు..ఉచిత ఇసుక విధానంలో భాగంగా కొత్త ఇసుక రీచుల గుర్తింపు, ఇసుక అక్రమ రవాణా అరికట్టడం తదితర అంశాలను ప్రణాళికలో పొందుపరచాలన్నారు . ఆర్ డబ్ల్యూ ఎస్ కి సంబంధించి త్రాగునీటి సమస్యలు రాకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకునే విధంగా లక్ష్యాలు నిర్ణయించుకోవాలన్నారు.. కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డి ఆర్ ఓ మధుసూదన్ రావు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు..

## జిల్లా ప్రధాన న్యాయమూర్తిని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా ఎస్పీ...

కర్నూలు జిల్లా ప్రతినిధి ఆగష్టు 08 విభారె న్యూస్..జిల్లా నూతన ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధీని మర్యాదపూర్వకంగా కలిసిన కర్నూలు జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్ ఐపియస్.కర్నూలు జిల్లా నూతన ప్రధాన న్యాయమూర్తి జి. కబర్ధీ ని గురువారం జిల్లా కోర్టు లో కర్నూలు జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపియస్ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. పెండింగ్ కేసులను తగ్గించడానికి ,లోక్ అదాలత్ ద్వారా అధిక సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యే విధంగా న్యాయశాఖ,పోలీసు శాఖలు సమన్వయంతో పని చేసి బాధిత కుటుంబాలకు సత్వరన్యాయంజరిగేలా కృషి చేయటం పై చర్చించారు. బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం అందించేలా,పోలీసు శాఖ తరపున కృషి చేస్తామని ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపీఎస్ తెలిపారు.



## ఏకగ్రీవంగా దేవిబెట్ట గ్రామ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గా కె.జగదీష్ కుమార్ ఎన్నిక

ఎమ్మిగనూరు గ్రామీణ, ఆగస్టు 08,ఎమ్మిగనూరు మండల పరిధిలోని దేవిబెట్ట గ్రామ పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ గా కె.జగదీష్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నిక అయినట్లు ఎన్నికల అధికారి గా వ్యవహరించిన విజయ కుమారి పేర్కొన్నారు.గురువారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎన్నికల అధికారి గా వ్యవహరించిన విజయ కుమారి అధ్యక్షతన 2024 పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు లో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యక్ష పద్ధతి ద్వారా నిర్వహించిన ఎన్నికలలో ఎవ్వరూ రాక పోవడం తో దేవిబెట్ట గ్రామ పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ గా కె.జగదీష్ కుమార్ ను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు,రమేష్, బాలవేమన, సావిత్రి, గ్రామ పెద్దలు వి.సోమేశ్వర రెడ్డి, శంకర్ రెడ్డి, బొడ్డన్న,ఈ. నాగరాజ గౌడ్, ఎన్.మహబూబ్ భాష, వి.రాముడు, ఎం.మల్దకల్ తదితరులు పాల్గొన్నారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190